ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
3
మంగళవారం 7 అక్టోబరు 2025



ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 24.0

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డెమోగా శ్రీనివాసరావు బాధ్యతలు



ఏలూరు అర్బన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల కార్యకలాపాలపై పర్యవేక్షణ, తనిఖీలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డెమో(డిస్ట్రిక్ట్ మాస్ ఎడ్యుకేషన్ మీడియా ఆఫీసర్)గా పదోన్నతి పొంది బదిలీపై జిల్లాకు నియమితులైన బి.శ్రీనివాసరావు సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. హెల్త్ అసిస్టెంట్‌గా 1993లో కానూరు పీహెచ్‌సీలో ఉద్యోగజీవితాన్ని ప్రారంభించిన ఆయన హెల్త్ ఎడ్యుకేటర్‌గా, డిప్యూటీ డెమోగా, హెచ్‌ఈఈవోగా పనిచేస్తూ ప్రస్తుతం గుంటూరు రీజినల్ ట్రైనింగ్ (ఫిమేల్) సెంటర్ నుంచి బదిలీపై జిల్లాకు డెమోగా నియమితులయ్యారు. విధుల్లో చేరిన తర్వాత డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతంను మర్యాదపూర్వకంగా కలిసి నియామకపత్రాలను అందజేశారు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. గత 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా కైకలూరు మండలంలో 38.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 7.7 మి.మీ నమోదైంది. ముదినేపల్లి 32.2, నిడమర్రు 25.2, ఆగిరిపల్లి 22.2, ఉంగుటూరు 20.6, కొయ్యలగూడెం 18.2, మండవల్లి 17.4, ఏలూరు అర్బన్ 11.4, ఏలూరు రూరల్ 6.2, కలిదిండి 5.4, జీలుగుమిల్లి 4.2, ద్వారకాతిరుమల 4.2, లింగపాలెం 2.4, పెదపాడు 2.4, చాట్రాయి 1.8, చింతలపూడి 1.2, పోలవరం 1 మి.మీ వర్షపాతం నమోదైంది.






కల్యాణ వైభోగమే..

చినవెంకన్న ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీవారి కల్యాణం వైభవంగా జరిగింది. సిగ్గులొలుకుతున్న అలివేలు మంగ, ఆండాళ్ అమ్మవార్లను సర్వాభరణ భూషితుడైన శ్రీవారు శుభ ముహూర్తాన పరిణయమాడారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై తిలకించారు.

దసరా కిక్కు!



- పండుగ వేళ మందుబాబులు తెగ తాగేశారు
- 13 రోజుల్లో రూ.49 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

దసరా సీజన్ మద్యం అమ్మకాలను రెట్టింపు చేసింది. వరుస సెలవులతో మందుబాబులు పండుగ చేసుకున్నారు.గతనెల 22 నుంచి ఈనెల 5వ తేదీ వరకు పండుగలు, ఉత్సవాల నేపథ్యంలో జిల్లాలో మందుబాబులు దసరా సీజన్‌ను ఎంజాయ్ చేశారు. మద్యం అమ్మకాలు పెరగడంతో ఆబ్కారీ శాఖకు ఆదాయం పెరిగింది. సెప్టెంబరు 30, ఈనెల 1,3వ తేదీల్లో ఏలూరు మద్యం డిపో నుంచి సుమారు రూ.15 కోట్ల విలువైన మద్యం దుకాణదారులు కొనుగోలు చేశారు. గాంధీ జయంతి రోజునే విజయదశమి రావడంతో దుకాణాలను మూయించేశారు. కానీ విక్రయాలను ఆపలేకపోయారన్న విమర్శలున్నాయి. ఈ సీజన్‌లో పెరిగాయి. జిల్లాలో అమ్మకాలు విపరీతంగా లిక్కర్, బీర్ల విక్రయాలు జోరందుకున్నాయి. ఆదివారం కూడా జిల్లా వ్యాప్తంగా పండుగ సందడి నెలకొంది. 15 శాతం అదనంగా అమ్మకాలు జరిగాయని అధికారులు చెబుతున్నారు.

గతేడాది రూ.35 కోట్లు.. ఇప్పుడు రూ.49 కోట్లు

జిల్లాలో 155 మద్యంషాపులు, 13 బార్లు ఉండగా గత 13 రోజుల్లో రూ.49 కోట్ల పైబడి అమ్మకాలు సాగాయి. ఇదే సమయానికి గతేడాది రూ.35 కోట్లు అమ్మకాలు జరిగాయి. ఏలూరు ఐఎంఎల్ డిపో నుంచి 66,374 కేసుల లిక్కర్, 28,613 కేసుల బీరు కేసులను ఆయా వ్యాపారులు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. వీటి విలువ రూ.49 కోట్ల 18లక్షలు ఉంటుందని అంచనా. ఇది పూర్తి కాగా కొత్త సరకుకు కోసం ఆయా షాపుల నుంచి ఇండెంట్లు వచ్చాయి.

మద్యానికి బానిసై.. కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య

ముదినేపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ వ్యక్తి తనకు వచ్చిన రోగాన్ని నయం చేయించుకునే స్తోమత లేక చివరికి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం ముదినేపల్లి మండలం వణుదుర్రుకు చెందిన బొర్రా వీర వెంకటేశ్వరరావు (54) మద్యానికి బానిస కావడంతో కొద్దిరోజులుగా తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ప్రైవేట్ ఆసుపత్రులో వైద్యం చేయించేందుకు ఆర్థిక స్తోమత లేక స్థానికంగా చికిత్స పొందుతున్నాడు. ఈ నెల 3న వెంకటేశ్వరరావుకు భరించలేని కడుపునొప్పి రావడంతో అతడు ఇంట్లో ఉన్న దోమల మందు తాగాడు. అది చూసిన కుమారుడు తండ్రిని గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఈ నెల 5న మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన రిపోర్టు మేరకు కేసు నమోదు చేసినట్టు ముదినేపల్లి పోలీసు స్టేషన్ హెచ్‌సీ ఎస్.వి.రామారావు తెలిపారు.

మద్యం తాగి బైక్ నడిపిన ఇద్దరికి జైలు

భీమడోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరికి కోర్టు ఇరవై రోజులు జైలు శిక్ష విధించినట్టు భీమడోలు పోలీసులు తెలిపారు. ఈనెల 6వ తేదీన భీమడోలు జాతీయ రహదారిపై సీఐ విల్సన్, ఎస్ఐ సుధాకర్‌లు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా దెందులూరు మండలానికి చెందిన గూడెల్లి జాన్‌బాబు, భీమడోలుకు చెందిన గండి వెంకట్రావు మద్యం తాగి వాహనాలు నడుపుతూ తనిఖీల్లో పట్టుబడ్డారు. వీరిని కోర్టుకు తరలించగా ఒక్కొక్కరికి ఏలూరు స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కేవీఆర్ మహేశ్వరి 20 రోజులు జైలు శిక్ష విధించినట్టు తెలిపారు.



ఆశల సాగు!

- ముంపు మండలాల్లో నెల రోజులు అలస్యంగా మిర్చి నాట్లు
- దిగుబడులు తగ్గే అవకాశం.. పొంచి ఉన్న తెగుళ్లు
- మూడు నెలలుగా వెంటాడిన గోదావరి వరద

కుక్కునూరు, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతంలోని సారవంతమైన భూములు మిర్చిపంటకు ప్రసిద్ధి. ఏటా ఆగస్టు, సెప్టెంబరు నాటికి రైతాంగం మిర్చిసాగు ఆరంభించేవారు. కానీ ఈ ఏడాది మూడునెలలుగా గోదావరి వరద ఏజెన్సీ వాసులను వెంటాడుతోంది. జూలైలో గోదావరి వరద పెరగడం ఆరంభమై తగ్గుతూ పెరుగుతూ సెప్టెంబరు చివరి వరకు ప్రభావం చూపింది. భద్రాచలం వద్ద 40-50 అడుగుల పైబడి నాలుగుసార్లు నీటిమట్టం నమోదైంది. ఈ క్రమంలో మిర్చిసాగుకు రైతులు వెనుకంజ వేశారు. సెప్టెంబరు రెండో వారంలో కొంతమంది రైతులు వరద రాదనే ధైర్యంతో సాగు ప్రారంభించారు. అయితే మరలా వరద ముంచెత్తడంతో దాదాపు 500 ఎకరాల్లో పంట మునగడంతో ఎకరానికి రూ.20 వేలు పైగా నష్టపోయారు. ప్రస్తుతం వరద తగ్గడంతో వారం రోజులుగా మిర్చినాట్లు జోరుగా సాగుతున్నాయి. ఒక్కో మిర్చి మొక్కను రూ.1.50కు నర్సరీల నుంచి రైతులు కొనుగోలు చేస్తున్నారు. మిర్చి సాగు ఇప్పటికే నెల రోజులు ఆలస్యం కావడంతో పంటపై నల్లి ప్రభావంతో పాటు దిగుబడి తగ్గే అవకాశం ఉందని (మిగతా 6వ పేజీలో)

ఐదు ఎకరాల్లో పంట మునక



గత నెల రెండో వారంలో ఐదు ఎకరాల్లో మిర్చిపంట వేశాను. గోదావరి వరద ముంచెత్తడంతో దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లింది. మళ్లీ మిర్చిమొక్కలు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే సాగు ఆలస్యం కావడంతో పంటపై నల్లి ప్రభావంతో పాటు దిగుబడులు తగ్గే అవకాశం ఉంది.

- దుద్దుకూరి శ్రీనివాసరావు,రైతు కుక్కునూరు

జనవరి 1 నాటికి..

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నియంత్రణ

- సంక్రాంతికి తడి,పొడి చెత్త నూరుశాతం సేకరణ
- కలెక్టర్ వెట్రిసెల్వి.. స్వచ్ఛాంధ్ర అవార్డుల అందజేత



స్వచ్ఛాంధ్ర జిల్లా అవార్డు గ్రహీతలతో కలెక్టర్ వెట్రిసెల్వి, జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, మేయర్ నూర్జహాన్, ఇతర అధికారులు

ఏలూరు,అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):'జిల్లాను స్వర్ణ ఏలూరు- స్వచ్ఛ ఏలూరుగా తీర్చిదిద్దడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం వహించాలి. జనవరి 1వ తేదీ నాటికి ప్రభుత్వ కార్యాలయాల్లో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నియంత్రించేలా చర్యలు తీసుకోవాలి. సంక్రాంతికి నాటికి జిల్లాలో నూరుశాతం ఇంటింటికి తడి,పొడి చెత్త సేకరణ చేసేలా ప్రణాళికా బద్ధంగా సాగాలి' అంటూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో రాష్ట్ర స్థాయిలో జిల్లాకు రెండు అవార్డులు, 51 జిల్లా స్థాయి అవార్డులను సాధించిన నేపథ్యంలో ఆయా సంస్థలు, వ్యక్తులు, కార్యాలయాలకు చెందిన వారికి స్థానిక సర్ సీఆర్ఆర్ రెడ్డి కళాశాల ఆడిటోరియంలో సోమవారం అవార్డులు, ప్రశంసా పత్రాలను కలెక్టర్ అందించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'అవార్డుల సాధనతో మరింత రెట్టింపు ఉత్సాహంతో రాబోయే లక్ష్యాల సాధనకు పనిచేయాలి. తడి,పొడి చెత్తలను వేరుచేసి తడిచెత్తను కంపోస్టుగా మార్చి మొక్కలకు ఎరువుగా వినియోగించేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలి. జిల్లాలో 50 వేల ఇళ్లలో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. ఏలూరు నగరంలోని డంపింగ్ యార్డులో 80 వేల టన్నులకు పైగా ఉన్న వ్యర్థాల నిర్వహణ చేసి తొలగించాలి' అని సూచించారు. జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సంపూర్ణ పారిశుధ్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు కార్పొ రేషన్ తరఫున చర్య లు తీసుకుంటున్నామన్నారు. జడ్పీ సీఈవో శ్రీహరి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, డీపీవో కె.అనురాధ, డీఎం హెచ్‌వో డాక్టర్ అమృతం, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్ కుమార్, డీపీటీవో షేక్ షబ్నం, కమిషనర్ భానుప్రతాప్ పాల్గొన్నారు.



మోదేలు గ్రామస్థులకు సౌకర్యాలు కల్పించండి

అధికారులకు ఎస్టీ కమిషన్ సభ్యుడు నాయక్ సూచన

■ లోపలి పేజీలో..



విన‌తులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్

ఏలూరు రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ లో మొత్తం 248 అర్జీలు స్వీకరించారు. సమస్యలకు క్షేత్రస్థాయిలోనే పరిష్కార మార్గాలు చూపించి అర్జీలు రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలని ఆమె సూచించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి : ఎస్పీ



ఏలూరు క్రైం : మోసపూరిత లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిశోర్ జిల్లా ప్రజలకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 45 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును చట్ట ప్రకారం విచారణ చేసి న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.

సమ్మెలోనే పీహెచ్‌సీ వైద్యులు

ఏలూరు అర్బన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):డిమాండ్ల సాధనకు పీహెచ్‌సీ వైద్యులు చేపట్టిన సమ్మె సోమవారం కొనసాగింది. విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో జిల్లాకు చెందిన 80 మంది పాల్గొన్నారని ఏపీ పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గంగాభవాని, డాక్టర్ జోషిమా తెలిపారు. సమ్మె విరమణకు ప్రభుత్వం ముందుంచిన ఐదు డిమాండ్ల అజెండాను ఆమోదించే వరకు విధులకు హాజరయ్యేది లేదన్నారు. సమ్మె చేస్తున్న వైద్యుల్లో చీలికలు వచ్చాయని జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దన్నారు.



బస్సులు ఫుల్

దసరాకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తిరుగుముఖం పట్టడంతో పాటు మహిళల ఉచిత ప్రయాణాలతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసి పోతున్నాయి. మరోవైపు బస్సుల కొరత ఏర్పడింది. పల్లెవెలుగు బస్సుల కోసం ప్రయాణికులు గంటలకొద్ది వేచి చూస్తున్నారు. సోమవారం ఏలూరు కొత్త బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. రిజర్వేషన్ కౌంటర్ల వద్ద బారులుదీరారు.

- ఫొటో గ్రాఫర్, ఏలూరు



జగన్మోహినిగా.. శ్రీవారు

ద్వారకాతిరుమల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మోహినీ అలంకారంలో శ్రీవారు సోమవారం భక్తజనులకు దర్శనమిచ్చారు. చిన వెంకన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముగ్ధ మనోహర రూపలావణ్యాలతో జగన్మోహినిగా భక్తులను కటాక్షించారు. క్షీరసాగర మదనంలో ఉద్భవించిన అమృతాన్ని దేవ, దానవులకు పంచేందుకు గాను శ్రీమహావిష్ణువు స్త్రీ రూపంలోకి మారారు. ఈ అలంకరణను అధిక సంఖ్యలో భక్తులు దర్శించి తరించారు.

సింహ వాహనంపై రాజసం

సింహవాహనంపై అలివేలు మంగ, అండాళ్ అమ్మవార్ల సమేతంగా కొలువైన దేవదేవుడు సోమవారం క్షేత్ర తిరు వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అభయహస్తాన్ని ఇస్తున్న శ్రీవారికి నీరాజనాలు సమర్పించారు. స్వామి, అమ్మవార్లను భక్తులు కొలిచారు. దుష్టజన సంహారానికి, భక్తజన సంరక్షణకు సంకేతంగా స్వామి సింహవాహనంపై ఊరేగారు.



కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్ల కల్యాణమూర్తులకు హారతులిస్తున్న అర్చకులు, కల్యాణవేదిక వద్దకు స్వామి, అమ్మవార్ల రాక, పట్టువస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, ట్రస్టీ నివృతరావు, ఈవో మూర్తి

కల్యాణం.. కమనీయం

- వైభవంగా చిన వెంకన్న కల్యాణం
- ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే
- శేషాచలంపై బ్రహ్మోత్సవ శోభ

ద్వారకాతిరుమల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): చిన్న తిరుమలేశుని కల్యాణవైభోగాన్ని వీక్షించే... ఆ కనులదే ఎంతో భాగ్యం.. ఈ వేడుక కమనీయం.. రమణీయం. సిగ్గులొలుకుతున్న అలివేలు మంగ, ఆండాళ్ అమ్మవార్లను సర్వాభరణ భూషితుడై తేజోవిరాజితుడైన శ్రీవారు.. శుభముహూర్త సమయాన పరిణయమాడారు. కల్యాణ ఘడియలో స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని వీక్షించిన భక్తులు తరించారు. దేవదేవుని కల్యాణ ఘట్టం ఆవిష్కృతమైన వేళ భక్తజనుల మది ఆనంద పారవశ్యంతో నిండింది. భక్తులు గోవిందా.. గోవిందా.. అంటూ తన్మయత్వంలో మునిగారు. ఈ అద్భుత దృశ్యం ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల వాసుని ఆలయంలో సోమవారం రాత్రి ఆవిష్కృతమైంది.

వేర్వేరు తిళక్క వాహనాలపై శ్రీవారు, అమ్మవార్లను ఉంచి అలంకరించారు. ఆలయ తూర్పుగోపుర సమీపంలో వేదిక దగ్గరకు తెచ్చారు. వేదికను పచ్చిపూలతో, కళాసౌందర్యాలతో అలంకరించారు. వేదికపై బంగారు సింహాసనంపై కల్యాణమూర్తులను ఉంచి అలంకరించి అర్చకులు కల్యాణతంతును ప్రారంభించారు.

పాంచాహ్నిక దీక్షతో వైఖానస ఆగమాన్ని అనుసరించి జరిగిన ఈ కల్యాణతంతులో భాగంగా ఆలయ అర్చకులు ముందుగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన, రక్షాబంధన ఆరాధన చేశారు. స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. రాష్ట్రప్రభుత్వం తరపున ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు అందించారు. ఆలయ చైర్మన్ రాజా ఎస్వి సుధాకరరావు, ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి దేవస్థానం తరపున కల్యాణమూర్తులకు పట్టువస్త్రాలను అందజేశారు. అర్చకులు కల్యాణమూర్తులకు మధుపర్కాలను సమర్పించారు. సుముహూర్త సమయంలో జీలకర్ర, బెల్లం ధరింపచేసి భక్తుల గోవిందనామ స్మరణల నడుమ మాంగల్యధారణ, తలంబ్రాలు వైభవోపేతంగా జరిపించారు.



కన్నుల పండువగా కాళ్లకూరు వెంకన్న కల్యాణం

కాళ్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గోవింద నామస్మరణతో కాళ్లకూరు గ్రామం మారుమోగింది. వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆశ్వయుజ మాస లఘు (చిన్న) కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. మరంగంటి ఝాన్సీలక్ష్మీ కుమారులతో ఆలయ అర్చకులు, వేద పండితులు అనిపెద్ది ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ అత్యంత వైభవంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎం.అరుణ్‌కుమార్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం



నరసాపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సబ్ కలెక్టర్ కార్యాలయం పరిశుభ్రతకు మారుపేరు. నిత్యం చెత్త తొలగించడంతో పాటు మూడో శనివారం క్రమం తప్పకుండా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి ఉద్యోగులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. కార్యాలయ ప్రాంగణం పరిశుభ్రత, పచ్చదనంతో కనిపిస్తుంది. మొక్కలు పెంపకం, కార్యాలయంలో పరిశుభ్రత తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఈపురస్కారం ఇచ్చారు

జిల్లా పరిషత్ కార్యాలయం



ఏలూరు సిటీ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాల విభాగంలో జడ్పీ కార్యాలయానికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు లభించింది. కార్యాలయ ఆవరణలో పచ్చదనం - పరిశుభ్రత, లోపల కూడా పరిశుభ్రంగా ఉండడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని స్వచ్ఛ అవార్డును ప్రకటించారు. పరిశుభ్రతతో అవార్డు పొందడంలో ఉద్యోగుల కృషి ఎంతో ఉందని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, సీఈవో ఎం.శ్రీహరి చెబుతున్నారు.

ఏకలవ్య పాఠశాల.. విప్పలపాడు



బుట్టాయగూడెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విప్పలపాడులో గిరిజన సంక్షేమ ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డు కైవసం చేసుకుంది. పాఠశాల పరిసరాలను, వసతి గృహాలు, ఆటస్థలం, డ్రెయిన్లు, రోడ్లను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు విద్యార్థులు పరిశుభ్రత పాటించేలా ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ మిశ్రా చర్యలు తీసుకున్నారు. పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

జిల్లా కేంద్ర ఆస్పత్రి.. తణుకు



తణుకు, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): తణుకులోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి జిల్లా స్థాయి స్వచ్ఛతా అవార్డుకు ఎంపికైంది. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో అవార్డు దక్కింది. ప్రధానంగా ఎల్‌బో ట్యాప్‌లు, సోప్ బాక్సులు, బయో స్టెరిలైజ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాల్లో ఉత్తమంగా తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నిలిచినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయి కిరణ్ తెలిపారు.

స్వచ్ఛ పురస్కారం సాధించిన పరిశుభ్రత - పచ్చదనం

- స్వచ్ఛతకు ప్రభుత్వం ప్రాధాన్యం
- అవార్డులతో ప్రోత్సాహం
- మునిసిపాలిటీలు, పంచాయతీలు, అంగన్‌వాడీలు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో శుభ్రతకు పెద్దపీట
- వ్యక్తిగత పురస్కారాలతో పాటు కార్యాలయ విభాగంలో అవార్డులు

మునిసిపాలిటీ అంటే అపరిశుభ్రతకు అనే అపప్రద నుంచి స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టి పరిశుభ్రతలో అవార్డులు అందుకునే స్థాయికి ప్రభుత్వం ప్రోత్సహించింది. పంచాయతీలు ఇంటింటా చెత్త సేకరించి పారిశుధ్యం మెరుగుపరచడంతో పాటు ఆదాయం పెంచుకునే దశగా చర్యలు తీసుకున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ వసతి గృహాలు, ఆస్పత్రులు, బస్టాండ్‌లు, ప్రభుత్వ కార్యాలయ ఆవరణ అద్దంలా మెరిసేలా తీర్చిదిద్దడంతో ప్రభుత్వం అవార్డులు అందజేసి ప్రోత్సహించింది. అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు బాలింతలు, గర్భిణులకు శుభ్రత, ఆహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు చేతుల పరిశుభ్రత, ఆరోగ్య సూచనలతో మెరుగైన ఫలితాలు సాధించారు. అవార్డులు అందుకున్న పలు సంస్థల పరిచయం..

పచ్చని పంచాయతీలు



కామయ్యపాలెం సంపద కేంద్రం

జీలుగుమిల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో పి.అంకంపాలెం, కామయ్యపాలెం పంచాయతీలు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చి రాష్ట్ర, జిల్లా అవార్డులు దక్కించుకున్నాయి. పి.అంకంపాలెం నుంచి ఎన్.సూరమ్మ రాష్ట్రస్థాయి గ్రీన్ అంబాసిడర్‌గా ఎంపిక కాగా, కామయ్యపాలెం పంచాయతీ జిల్లా స్థాయి అవార్డు దక్కించుకుంది.

కామయ్యపాలెం పంచాయితీలో పారిశుధ్య చర్యలతోపాటు గ్రామంలో పలు అంశాలపై స్థానికుల్లో అవగాహన కల్పించారు. గ్రామాల్లో చెత్త కనిపించకుండా వీధుల్లో చెత్త డబ్బాలు ఏర్పాటు చేశారు. తడి పొడి చెత్తను వర్మి తొట్టెల్లో వేసి వర్మి తయారు చేశారు. తయారైన ఎరువు అటవీశాఖ అధికారులకు అమ్మడంతోపాటు వాటిని నర్సరీలకు తరలించే చర్యలు తీసుకున్నామని ఎంపీడీవో టి.నిఖిల్ మధు శరణ్ తెలిపారు.

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరు, వేండ్ర పంచాయతీలు స్వచ్ఛ పురస్కారాలు అందుకున్నాయి. పారిశుధ్యం మెరుగుదల, ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాల నిర్వహణలో శ్రద్ధ వహించాయి. ఇంటింటా తడి, పొడి చెత్త సేకరించి డంపింగ యార్డుకు తరలించడంతో గ్రామాలు పరిశుభ్రంగా మారాయి. వేండ్ర సర్పంచ్ కడలి నాగేశ్వరి, కార్యదర్శి కృష్ణమోహన్, విస్సాకోడేరు సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, కార్యదర్శి పవన్‌కుమార్‌ను గ్రామస్తులు అభినందించారు.

నిడమర్రు: జిల్లా స్థాయి ఉత్తమ స్వచ్ఛ పంచాయతీగా ఛానమిల్లి గ్రామ పంచాయితీ ఎంపికయ్యింది. సంపద సృష్టి కేంద్రాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణ, తడి, పొడి చెత్త సేకరణ, వర్మీ కంపోస్టు తయారీ అంశాలతో జిల్లా స్థాయిలో ఉత్తమ స్వచ్ఛ పంచాయతీగా ఛానమిల్లి గుర్తింపు పొందడం ఎంతో ఆనందంగా ఉందని సర్పంచ్ నంద్యాల ప్రసాద్, కార్యదర్శి మామిడూరి సంజీవరావు అన్నారు. ఈ అవార్డు మాకు మరింత ప్రోత్సాహంగా ఉందన్నారు.

ఆకివీడు రూరల్: జిల్లా స్వచ్ఛ పంచాయతీగా సిద్ధాపురం పంచాయతీ అవార్డు అందుకుంది. గ్రామానికి చెత్త ట్రాక్టరు, పారిశుధ్య కార్మికులు ద్వారా తడిపొడిచెత్తను విడివిడిగా సేకరించి డంప్ చెయ్యడం, వర్మీకంపోస్టు తయారు చెయ్యడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించడం వంటి కార్యకలాపాలు క్రొత్త పద్దతులలో నిర్వహించి ఆదర్శంగా నిలవడం వలన అవార్డు పొందినట్లు కార్యదర్శి సతీష్ తెలియజేశారు. ప్రజల సహకారంతో అవార్డు రావడం ఆనందంగా ఉందని తెలిపారు.

తణుకు రూరల్: మండలంలోని తేతలి, కోనాల గ్రామ పంచాయతీలు జిల్లా స్థాయి స్వచ్ఛ అవార్డులు పొందాయి. బహిరంగ ప్రదేశాల్లో పరిసరాల పరిశుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, స్థిర వ్యర్థాల నిర్వహణలో కొత్త ప్రమాణాలు పాటించడం వంటి అంశాల ఆధారంగా తేతలి గ్రామ పంచాయితీకి, ఉత్తమ గ్రీన్ అంబాసిడర్ విభాగంలో తేతలి గ్రామానికి చెందిన బచ్చల రామచంద్రం, స్వచ్ఛ అంగన్‌వాడీల విభాగంలో కోనాలకు చెందిన డి.లక్ష్మీ సుజాతను అవార్డులు వరించాయి.



విస్సాకోడేరు, వేండ్ర పంచాయతీలు

మునిసిపాలిటీలు పరిశుభ్రం



ఏలూరు, భీమవరంలో పారిశుధ్య నిర్వహణ

ఏలూరు టూటౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగర పాలక సంస్థ కార్యాలయాన్ని స్వచ్ఛాంధ్ర అవార్డు వరించింది. ప్రభుత్వ కార్యాలయాల స్వచ్ఛత కేటగిరిలో లభించింది. ప్రతీరోజు మరుగుదొడ్ల శుభ్రంగా ఉంచడం, హ్యాండ్‌వాషింగ్ సౌకర్యం కల్పించడం, తడి, పొడి చెత్తకు వేర్వేరు డస్ట్‌బిన్‌లను కార్యాలయంలో ఉంచడం ద్వారా పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చారు. సిబ్బందికి పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఎంప్లాయీస్ ఫీడ్‌బ్యాక్‌తో అవార్డు అందుకున్నారు. అవార్డు లభించడంపై మేయర్ షేక్ నూర్జహాన్, కమిషనర్ భానుప్రతాప్ ఆనందం వ్యక్తం చేశారు.

భీమవరం టౌన్: స్వచ్ఛ మునిసిపాల్టీల విభాగంలో భీమవరం మునిసిపాల్టీ అవార్డు అందుకుంది. 39 వార్డుల్లో ఇంటింటి నుంచి వాహనాల ద్వారా చెత్త సేకరణ, తడి, పొడి చెత్తను వేరు చెయ్యడం, స్వచ్ఛతా హి సేవా-2025 లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించడం అంశాలతో అవార్డు అందిపుచ్చుకుంది. పట్టణంలో ప్లాస్టిక్ నిషేధాన్ని పూర్తి స్థాయిలో అమలకు తీసుకున్న చర్యలు, వ్యాపారులతో సమావేశాలు ఏర్పాటు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు ఇతర మునిసిపాల్టీలకు ఆదర్శంగా నిలచి ఈ వార్డును దక్కించుకుంది.

జంగారెడ్డిగూడెం: స్వర్ణాంధ్ర, సచ్ఛాంధ్ర కార్యక్రమాల అమలులో జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీ జిల్లా ప్రథమస్థానం సాధించింది. డంపింగ్ యార్డులో చేపట్టిన వ్యర్థాల నిర్వహణతో ఉత్తమ ఫలితాలు సాధించారు. 3 నెలల్లో 18,736 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేశారు. ప్రతీ రోజు ఇళ్ల నుంచి చెత్త సేకరణ, ప్లాస్టిక్, తడి, పొడి చెత్తపై మునిసిపల్ కమిషనర్ కెవి.రమణ ప్రజలకు అవగాహన కల్పించడం మంచి ఫలితాలు ఇచ్చింది.

అద్దంలా మెరిసిన వసతి గృహాలు



నరసాపురం పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహం

నరసాపురం రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాయపేట బీసీ వసతి గృహం పరిశుభ్రతకు మారు పేరు. విద్యార్థులకు స్వచ్ఛాంధ్రపై పూర్తి అవగాహన కల్పించారు. బాత్‌రూమ్‌లు, టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉంచడం, చెత్త నిర్వహణ, ఆర్వో వాటర్, మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడంలో వసతి గృహం ముందంజలో ఉంది. స్టేషన్‌పేటలో సాంఘిక సంక్షేమ వసతి గృహం విద్యార్థులు ప్లాస్టిక్ కవర్ల దూరం చేశారు. స్వచ్ఛాంధ్రను క్రమం తప్పకుండా పాటిస్తారు. చెత్తనంతా డస్ట్‌బిన్‌లో వేస్తున్నారు. పదికిపైగా డస్ట్‌బిన్‌లు పెట్టారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచారు. నీరును వృథా చేయరు. ఆరోగ్యం, వ్యాయామం, చదువు, హాస్టల్ నిర్వహణలో విద్యార్థులు భాగస్వామ్యం అవుతున్నారు.

నిడమర్రు: మండలంలోని పెదనిండ్రకొలను సాంఘిక సంక్షేమ వసతి గృహం ఉత్తమ స్వచ్ఛ వసతిగృహంగా ఎంపికైంది. వసతి గృహం భవనం, టాయిలెట్స్, గదుల నిర్వహణ, వంట గది పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై వసతి గృహం అధికారి జీబీ.కళ్యాణి ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకున్నారు. అవార్డుకు ఎంపికవుతామని ఊహించలేదని, అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు. వసతి గృహ పరిసరాలు, విద్యార్థులు శుభ్రత పాటించడంలో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తామని కళ్యాణి తెలిపారు.

అంగన్‌వాడీల్లో ఆరోగ్యం



అంబర్‌పేట అంగన్‌వాడీ

భీమడోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉత్తమ స్వచ్ఛ అంగన్‌వాడీ కేంద్రంగా అంబరుపేట 16వ నెంబరు కేంద్రం ఎంపికైంది. అంగన్‌వాడీ కార్యకర్త బి.సంతోషమ్మ నిర్వహణలో బాలింతలు, గర్భిణులకు వంటగది పరిశుభ్రత, పౌష్టికాహార నియమాలు, వంటకాలు నేర్పించడంలో శ్రద్ధ వహించారు. చిన్నారులకు భోజనం ముందు తరువాత చేతులు శుభ్రత నియమాలను నేర్పించారు. కేంద్రం ఆవరణలో తడి చెత్త, పొడిచెత్తను గ్రామ పంచాయతీకి అప్పగించడం, కూరగాయలు, ఆకుకూరలు పెంచడం, వినియోగించడం వంటి కార్యక్రమాలు ఈ కేంద్రానికి జిల్లా స్థాయిలో అవార్డు రావడానికి దోహదపడ్డాయి.

పాలకోడేరు: మండలంలోని మైప అంగన్‌వాడీ కేంద్రం స్వచ్ఛాంధ్ర పురస్కారంతో మెరిసింది. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పెరట్లోనే కూరగాయల మొక్కలు పెంచి పిల్లలకు ఆహారంగా వండి పెడుతున్నారు. ఆవరణ పచ్చదనం, పరిశుభ్రతతో తీర్చిదిద్దిన అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతిలక్ష్మిని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

ద్వారకాతిరుమల: మండలంలోని తిరుమలంపాలెం-2 అంగన్‌వాడీ కేంద్రం టీచర్ షేక్ సుల్తానబీ నిర్వహణలో జిల్లా స్థాయి అవార్డు సాధించింది. తడి, పొడి చెత్త నిర్వహణ, పరిశుభ్రత, సురక్షితమైన త్రాగునీరు, పిల్లల వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, ఆరోగ్యకరమైన ఆహారం అంశాల్లో అవార్డు సాధించినట్లు సీడీపీవో బ్యూలా పరిమి, సూపర్‌వైజర్ మేరీ తెలిపారు. అంగన్వాడీ కేంద్ర పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం, కిచెన్, టాయిలెట్లు పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. పిల్లలు, సిబ్బంది భోజనానికి ముందు తర్వాత చేతులు కడుక్కునే అలవాటును ప్రోత్సహించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు రక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారు.

భీమవరం రూరల్: రాయలం అంగన్‌వాడీ కేంద్రం స్వచ్ఛ అంగన్‌వాడీగా ఎంపికైంది. చిన్నారులకు పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పారు. ఆకుకూరలు స్వయంగా పండించి పౌష్టికాహారంగా చిన్నారులకు అందించడం జరిగింది. ఇలాంటి అంశాలు పరిగణనలోకి తీసుకుని స్వచ్ఛంధ్ర అవార్డులు అందించింది. భీమవరం పట్టణంలోని ఝాన్సీలక్ష్మీబాయి మునిసిపల్ బాలిక పాఠశాల స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు ఎంపికైంది. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా విద్యార్థినులు పరిశుభ్రతకు సంబంధించినవి పాటించడం, వంటశాల, ఆహారం అందించడంలో పరిశుభ్రత పాటించటం వంటి వాటిపై అవార్డు వరించింది.

దెందులూరు: మండలంలోని కొవ్వలి అంగన్వాడీ కేంద్రం ఉత్తమ పురస్కారం అందుకుంది. మరుగుదొడ్ల నిర్వాహణ, వ్యక్తిగత శుభ్రత, వంటశాల శుభ్రతపై దృష్టి సారించారు. పిల్లలు ప్లాస్టిక్ వాడకుండా చర్యలు తీసుకోవడంతో స్వచ్ఛ అంగన్వాడీ కేంద్రం అవార్డు ప్రటించడం చాలా సంతోషంగా ఉందని అంగన్వాడీ టీచర్ కె.దేవి, సూపర్‌వైజర్ శ్రీదేవి ఆనందం వ్యక్తం చేశారు.



కొవ్వలి అంగన్‌వాడీ కేంద్రం

స్వచ్ఛ బస్టాండ్లు



ఏలూరు కొత్త బస్టాండ్

ఏలూరు

ఏలూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఏలూరు బస్ డిపో స్వచ్ఛ బస్టాండ్‌గా అవార్డు అందుకుంది. బస్టాండ్ ఆవరణ శుభ్రత, టాయిలెట్లు పునరుద్ధరణ, 3 సీటర్ కుర్చీల ఏర్పాటు, 15 కొత్త ఫ్యాన్లు బిగించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించారు. ఆర్వో వాటర్ ప్లాంట్ (కూలింగ్)తో రక్షిత మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. బస్టాండ్ ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని డీపీటీవో షేక్ షబ్నం, డీఎం బి.వాణి తెలిపారు.

నరసాపురం

నరసాపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో ఆర్టీసీ నరసాపురం డిపో ఉత్తమ బస్టాండ్‌గా ఎంపికైంది. ప్రయాణికులకు తాగు నీరు, బస్టాండ్‌లో సదుపాయాలు, మరుగుదొడ్లు, ప్రయాణికులు కూర్చునే కుర్చీల నిర్వహణ, తడి, పొడి చెత్త వేరు చేయడం, బస్సుల్లో శుభ్రత తదితర అంశాలతో జిల్లా స్థాయి ఉత్తమ బస్టాండ్ అవార్డు వరించింది. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ పరిశుభ్రంగా ఉంచడంలో డీఎం ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ప్రయాణికులకు అవగాహన కల్పించారు.



నరసాపురం బస్టాండ్ ఆవరణ

విష్ణు కళాశాల విద్యార్థినులకు గూగుల్ ఉద్యోగాలు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

భీమవరం రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ రంగం స్లోగా ఉంది. ఉద్యోగ అవకాశాలు నాలుగేళ్లుగా అంతంతగానే ఉన్నాయి.. అంటూ నిరాశ పడుతున్న వేళ.. భీమవరంలోని విష్ణు మహిళా ఇంజనీరింగ్ విద్యార్థినులు గూగుల్‌లో ఉద్యోగాలు సాధించారు. ఏకంగా ఏడాదికి రూ. 59.1 లక్షల జీతం పొందనున్నారు. ప్రతిభ, పట్టుదల ఉంటే ఎలాంటి సమయంలోనైనా ఉద్యోగాన్ని అందిపుచ్చుకోగలమని వీరు నిరూపించారు. వీరిలో ఒక విద్యార్థిని డి.రేణుక గంగా తండ్రి విజయవాడలో ఆర్టీసీ కండక్టర్‌గా పని చేస్తున్నారు. ఉద్యోగ రీత్యా విజయవాడలో ఉంటుంటారు. అసలు ఊరు ముదినేపల్లి మండలం వడలి గ్రామం. మరొక విద్యార్థినికి డి.సాత్విక. తండ్రి ఫైనాన్షియల్ ఉద్యోగం చేస్తున్నారు. ఉద్యోగ రీత్యా విశాఖపట్నంలో ఉంటున్నారు. అసలు ఊరు గుంటూరు జిల్లా చిలకలూరి పేట. కళాశాల నుంచి గూగుల్ కంపెనీకి ఎంపిక కావడంపై రేణుక గంగా, సాత్వికలను విష్ణు ఎడ్యుకేషన్ చైర్మన్ కేవీ విష్ణురాజు, వైస్ చైర్మన్ రవి చంద్రన్ రాజగోపాల్, సెక్రటరీ ఆదిత్య విక్రం, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ వెంకట్రామరాజు అభినందించారు.

ఐఐటీకి వెళదామనుకుని..



ఐఐటీకి వెళదామనుకుని ఇంజనీరింగ్‌లో చేరాను. ప్రథమ సంవత్సరం నుంచి గూగుల్ కంపెనీలో ఉద్యోగం సాధించాలని లక్ష్యం పెట్టుకున్నాను. ఆలోచనలతో చేశారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకున్నాను. నాకు తెలిసిన సీనియర్స్ నుంచి కొన్ని వాటిపై అవగాహన పెంచుకున్నాను. మంచి ఉద్యోగాలు సాధించిన వేరే కళాశాల వాళ్ళ గురించి తెలుసుకున్నాను. ప్రతిభ కలిగిన వారి వాట్సప్ గ్రూపులో చేరాను. దాని వల్ల కొంత మోటివేషన్ పెరిగింది. కళాశాల నుంచి మంచి ట్రైనింగ్ అందింది. ఎక్కువ సమయం చదువుకు కేటాయించాను. హార్డ్ వర్క్ చేశాను.

– డి.సాత్విక, విష్ణు మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని


కౌశల్ సైన్స్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈవో, తదితరులు

కౌశల్ సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలైన కౌశల్-2025 సైన్స్ పోటీల షెడ్యూలును ప్రభుత్వం విడుదలచేసింది. ఈ మేరకు పోటీల వాల్‌పోస్టర్లను సోమవారం డీఈవో వెంకటలక్ష్మమ్మ, అసిస్టెంట్ డైరెక్టర్ అవధాని, రాష్ట్ర కోఆర్డినేటర్ స్వర్ణ వెంకటేశ్వరరావు, జిల్లా కోఆర్డినేటర్ జె.విజయరత్నబాబు ఏలూరులో విడుదల చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చన్నారు. క్విజ్‌పోటీలు 8, 9, 10 తరగతుల విద్యార్థులకు, రీల్ పోటీ 10వ తరగతి విద్యార్థులకు, పోస్టర్ కాంపిటీషన్ 8, 9 తరగతుల విద్యార్థులకు జరుగుతాయన్నారు. అక్టోబరు వరకు నిర్దేశించిన ఎస్సీఈఆర్టీ సిలబస్ అనుసరించి పోటీలు ఉంటాయన్నారు. పాఠశాల స్థాయిలో ప్రతీ పోటీ నుంచి 20మంది చొప్పున విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపికచేస్తారని వివరించారు. జిల్లాస్థాయిలో ఆన్‌లైన్ విధానంలో పోటీలు జరుగుతాయని, ప్రతీ విభాగంలో ఇద్దరుచొప్పున విజేతలను ఎంపికచేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. పాఠశాల స్థాయి పోటీలు నవంబరు 1, 3, 4 తేదీలు, జిల్లాస్థాయి పోటీలు నవంబరు 27, 28 తేదీలు, రాష్ట్రస్థాయి పోటీలు డిసెంబరు 27న తిరుపతి భారతీయ విజ్ఞాన సమ్మేళనం భవనంలో జరుగుతాయని వివరించారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో పీఈటీ పద్మావతి

లింగపాలెం, అక్టోబరు 6, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎస్జీఎఫ్ సెలక్షన్స్ ఏలూరు ఇండోర్ స్టేడియంలో హ్యాండ్ బాల్ సెలక్షన్స్ అండర్-14 క్రీడా విభాగంలో లింగపాలెం మండల కలరాయగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కలరాయగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్లో తొమ్మిదవ తరగతి చదువుతున్న మాణికల అఖిల్‌కుమార్, చెరుకు విక్రమ్, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక అయ్యారు. ఎంపికైన విద్యార్థులను పీఈటీ ఎం.పద్మావతి, హెచ్ఎం కె శ్రీనివాసరావు, ఎంఈవోలు కె రామారావు, జె రవీంద్ర, గ్రామ సర్పంచ్ సీహెచ్.రవిబాబు అభినందించారు.


సిద్ధాంతం వశిష్ఠ గోదావరికి పంచ హారతులు ఇస్తున్న పండితులు

గోదావరికి హారతి

పెనుగొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సిద్ధాంతంలో సోమవారం రాత్రి గోదావరి పుష్కర రేవు వద్ద ఆశ్వయుజ పూర్ణిమ సందర్భంగా గోదావరి హారతి, వాల్మీకి మహర్షి జయంతి అత్యంత వైభవంగా నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి, వేద పండితులు కలగ భద్రుడు స్వామి ఆధ్వర్యంలో నిట్టాల సతీష్, లక్ష్మీదేవి దంపతులు వశిష్ఠ గోదావరికి పంచ హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ రేణుక, తదితరులు పాల్గొన్నారు.


ఓ చేపల చెరువులో వేసిన చికెన్ వ్యర్థాలు

నిబంధనలకు తూట్లు..
ప్రజారోగ్యంతో ఆటలు !

- అడ్డగోలుగా చికెన్ వ్యర్థాల తరలింపు
- చేపల చెరువుల మేతగా వినియోగం
- చోద్యం చూస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చేపల పెంపకంలో మేతగా చికెన్ వ్యర్థాల వినియోగం పెచ్చుమీరుతోంది. అది ప్రజారోగ్యానికి చేటుగా పరిణమిస్తోంది. జంట నగరాలైన హైదరాబాద్, సికింద్రాబాద్‌ల నుంచి చికెన్ వ్యర్థాలు రోజుకు 50కు పైబడి లారీల్లో జిల్లాలోని చేపల చెరువులకు డంప్ అవుతోంది. మత్స్యశాఖ, పోలీస్, రెవెన్యూ శాఖలు పట్టనట్టు వ్యవహరించడంతో వ్యర్థాలు తరలించే మాఫియా ఆటలు యథేచ్ఛగా సాగుతున్నాయనే ఆరోపణలున్నాయి.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఏలూరు జిల్లాలో కొల్లేరుతో పాటు పరివాహక ప్రాంతాల్లోని చేపల చెరువులకు దాణా, పిల్లెట్ రూపంలో భారీగా మేత ఖర్చులవుతున్నాయి. దీనిని తప్పించుకోవడానికి యజమానులు అడ్డదారులు తొక్కుతూ నిబంధనలకు తూట్లు పొడుస్తూ చికెన్ వ్యర్థాలతో ప్రజారోగ్యానికి చేటు తెస్తున్నారు. ఒకప్పుడు విచ్చలవిడిగా జిల్లాలో ఆఫ్రికన్ క్యాట్‌ఫిష్ పెంపకం గుట్టుచప్పుడు కాకుండా సాగిపోతుండేది. అప్పుడు ఈ చికెన్ వ్యర్థాల మాఫియా ఆగడాలకు అంతేలేకుండా పోయేది. నిబంధనలను మామూళ్లతో ఏమార్చి.. సరుకును సరఫరా చేసి రూ.కోట్ల టర్నోవర్ సాగించేవారు. క్యాట్‌ఫిష్‌కు కోల్‌కత్తా, బెంగాల్ మార్కెట్లలో అప్పట్లో డిమాండ్ ఉండేది. అప్పుడు క్యాట్‌ఫిష్ చెరువులను జిల్లా యంత్రాంగం ఖాళీ చేయించడంతో.. ఇప్పుడు మేతతో పెరిగే చేపలకు చికెన్ వ్యర్థాల మోత పెచ్చుమీరుతోందన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కిలో రూ.3 నుంచి రూ.5కు సేకరించి, దాన్ని ఏలూరు జిల్లాలో చేపల చెరువులకు కిలోకి రూ. 12 నుంచి రూ.13 వరకు అమ్ముతున్నారు. వ్యర్థాలను బొలెరో వాహనంలో తరలిస్తే రూ.20 వేలు, ఐషర్ వాహనంలో రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు సరఫరా చేసే మాఫియాకు మిగులుతున్నట్టు తెలుస్తోంది.

వివిధ రూట్లలో సాగుతోందిలా ..

హనుమాన్ జంక్షన్- అప్పనవీడు, పెరికీడు-వసంతవాడ, వెంకటాపురం-అందేఖాన్ చెరువు, వడ్డిగూడెం-గుడిపాడు, మాదేపల్లి-శ్రీపర్రు, నూజివీడు- మీర్జాపురం, ఏలూరు రైల్వేస్టేషన్ సమీపంలోని కొమడవోలు నుంచి చాటపర్రు మీదుగా వయా గుడివాకలంక, దెందులూరు చెక్‌పోస్టు మీదుగా పూళ్ల, ఆగడాలలంక, చెట్టున్నపాడులకు యథేచ్ఛగా చికెన్ వ్యర్థాల లోడులు వ్యాన్‌ల్లో(9 టన్నులు), లారీల్లో (14 టన్నులు) చొప్పున తరలిపోతుంటాయి. అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకోకపోతే ఒక్క పెదపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోనే అడపాదడపా కేసులు నమోదవుతుంటాయి. ఈ విషయంలో రోజూ లక్షల్లో చేతులు మారుతున్నట్టు ఆరోపణలున్నాయి. చేపల చెరువుల్లో మేతగా దాణా, పిల్లెట్ల రూపంలో ఖర్చు తగ్గించుకోవడానికి చేసుకునే దందాలో ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉంది. దెందులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోనే, ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్లలో కేసుల నమోదు చేయకపోవడం, లోడ్ వ్యాన్‌లు, లారీలు పట్టివేత లేకపోవడం వెనుక మాఫియా అండదండలు ఏ మేరకు అందుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ మాఫియాకు అడ్డుకట్ట వేసే విషయంలో జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులకు పట్టించుకోకపోవడం శోచనీయం.

రెండు నియోజకవర్గాలే అడ్డాగా..

చికెన్ వ్యర్థాల మాఫియాలో కొందరు ప్రజాప్రతినిధుల అనుచరులు, ఇతర ముఖ్యనేతలు ఇందులో భాగస్వామ్యం వహిస్తున్నారు. పెదపాడు, దెందులూరు, భీమడోలు, ఏలూరు రూరల్ మండలాల్లోని కొందరి నేతల గణం.. ఈ మాఫియాకు అండగా ఉన్నారన్న ఆరోపణలున్నాయి. రోజుకు 50కు పైనే చికెన్ వ్యర్థాల లోడు లారీలు ప్రధానంగా దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాలే అడ్డాగా రవాణా సాగుతుంటే నిఘా ఉంచాల్సిన పోలీస్ యంత్రాంగమే చతికిలపడుతోంది. కృష్ణాజిల్లా హైవేపై నుంచి హనుమాన్ జంక్షన్ మీదుగా అప్పనవీడు నుంచి వివిధ రూట్లలో అక్రమంగా చికెన్ వ్యర్థాలు తరలుతుంటాయి. ఇదిలా ఉండగా చికెన్ వ్యర్థాలు తరలించే వాహనాలకు డ్రైవర్లను సరఫరా చేసే ప్రాంతం మాత్రం భీమడోలు మండలం తోకలపల్లిగా చెబుతుండటం విశేషం.


పెదపాడులో పట్టుకున్న చికెన్ వ్యర్థాలు తరలించే వ్యాన్లు(ఫైల్)

మోదేలు గ్రామస్థులకు సౌకర్యాలు కల్పించండి

అధికారులకు ఎస్టీ కమిషన్ సభ్యుడు నాయక్ సూచన

బుట్టాయగూడెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తాతల కాలం నుంచి అడవినే నమ్ముకుని జీవిస్తున్న తమను గ్రామాన్ని ఖాళీ చేయమంటే ఎట్టి పరిస్థితుల్లోను అంగీకరించబోమని మోదేలు కొండరెడ్లు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌కు తేల్చి చెప్పారు. వారి ఆవేదనను విన్న నాయక్ వారు కోరినట్లే ఇక్కడే వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఏలూరు జిల్లా కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని బుట్టాయగూడెం-వేలేరుపాడు సరిహద్దు మండలాల్లోని మోదేలు కొండరెడ్డి గ్రామాన్ని జాతీయ ఎస్టీ కమిషన్ మెంబరు హుస్సేన్ నాయక్ సోమవారం సందర్శించి వారి సమస్యలడిగి తెలుసుకున్నారు. కొండరెడ్లు కోరినట్లు గ్రామంలోనే మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. లంకపాకల గ్రామాన్ని సందర్శించిన కమిషన్ మెంబరుకు గ్రామస్థులు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు ఇవ్వాలని, ఆర్ అండ్ ఆర్ సమస్యలు పరిష్కరించాలని, ఆయుధ డిపోను వేరే ప్రాంతంలో నిర్మించాలని కోరారు. మాజీ మంత్రి జలగం ప్రసాదరావు, ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్, ఆర్డీవో ముక్కంటి, డీఎఫ్‌వో సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..

కొయ్యలగూడెం: చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ అన్నారు. ఏ వర్గాల ప్రజలైనా తమ సమస్యలను కమీషన్ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సోమవారం కొయ్యలగూడెంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా భారతదేశం నిలుస్తుందని అందుకు ప్రధాని నరేంద్రమోడీ తీసుకుంటున్న నిర్ణయాలే కారణమన్నారు. ప్రజలకు సేవ చేయడంలో అధికారులు చిత్తశుద్ధి చూపటంలేదని విమర్శించారు. పశ్చిమ ఏజెన్సీ సమస్యలు తెలుసుకోవడానికి వచ్చానని ఈ సందర్భంగా తెలిపారు. సమావేశంలో ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొల్లిన నిర్మలాకిషోర్, మహిళా మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుభద్రాదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు పారేపల్లి రామారావు, సోముబాబు, టీడీపీ నాయకురాలు గంగిరెడ్ల మేఘలాదేవి, జనసేన మండల అధ్యక్షుడు తోట రవి, బీజేపీ మండల అధ్యక్షుడు గొలిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

8న బీఎస్సీ హార్టికల్చర్‌లో ప్రవేశానికి కౌన్సెలింగ్ : రిజిస్ట్రార్

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయ పరిధిలో కళాశాలల్లో బీఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్ ప్రవేశానికి ఈ నెల 8న మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు రిజిస్ట్రార్ డాక్టర్ బి శ్రీనివాసులు సోమవారం తెలిపారు. హార్టిసెట్ ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు వివరించారు. విద్యార్థులు స్వయంగా తగిన ధ్రువపత్రాలు, ఫీజుతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని రిజిస్ట్రార్ తెలిపారు.

ఎస్జీఎఫ్ క్రీడా ఎంపికలకు 376 మంది హాజరు

ఏలూరు అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు తైక్వాండో, హ్యాండ్‌బాల్ ఎంపికలు సోమవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో జరిగాయి. వివిధ పాఠశాలల నుంచి మొత్తం 376 మంది క్రీడాకారులు, 27 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వ్యాయామ విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు కె.అలివేలు మంగ, కె.దుర్గాప్రసాద్ తెలిపారు. విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అవధాని, పీఈటీల సంఘం కార్యదర్శి ఐ.రమేష్ పాల్గొన్నారు.

బస్సు నుంచి జారిపడి చెయ్యి నుజ్జునుజ్జు


గాయపడిన గిరిజన మహిళ

బుట్టాయగూడెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు నుంచి జారిపడి ఓ మహిళ తన చెయ్యిని కోల్పోయింది. మండలంలోని లక్ష్మీపురం వద్ద సోమవారం ఈ ఘటన జరిగింది. మండలంలోని పాత రాజానగరం గ్రామానికి చెందిన వెట్టి జయమ్మ కన్నాపురం నుంచి పోలవరం వెళ్తున్న జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును రాజానగరంలో ఎక్కింది. ప్రయాణికులతో బస్సు ఫుల్‌గా ఉండటంతో ఫోర్ వద్దే ఉన్న జయమ్మ లక్ష్మీపురం బ్రిడ్జి వద్ద ప్రమాద వశాత్తు కింద పడిపోయింది. అదే సమయంలో బస్సు వెనుక టైర్లు చెయ్యి మీదుగా వెళ్లడంతో పూర్తిగా నలిగిపోయింది. తోటి ప్రయాణికుల ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని జయమ్మను హుటాహుటిన రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో బస్సు లో పరిమితికి మించి జనాలను ఎక్కించడం వల్లే ఇలా జరిగిందని, ఇరుకైన సింగిల్ రోడ్డులో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడం వల్లే జయమ్మ గాయపడినట్టు ప్రయాణికులు పేర్కొన్నారు. జయమ్మ గాయపడిన విషయాన్ని కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు.

రైలు ఢీకొని మతి స్థిమితం లేని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలుదాటుతున్న ఒక వ్యక్తిని ప్రమాద వశాత్తు రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు ఆదివారపుపేటకు చెందిన మునిశెట్టి బంగారుబాబు(40) రజక వృత్తిని చేస్తూ జీవిస్తున్నాడు. అతని భార్య అనారోగ్యంగా ఉండడంతో బంగారుబాబు మానసికంగా ఎంతో వేదన పడుతూ మతిస్థిమితం కోల్పోయాడు. సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి గన్‌బజార్ వద్ద రోడ్డు కం రైల్వే బ్రిడ్జి వద్ద రైలు పట్టాలుదాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రైల్వే పోలీసులకు అందడంతో రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కల్పించిన 40 మందిపై కేసు

పెనుగొండ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన 40 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. దేవి నవరాత్రుల సందర్భంగా మండలం సిద్ధాంతం దుర్గమ్మ గుడి బస్టాండ్ సెంటర్ రోడ్డులో ఎటువంటి అనుమతి లేకుండా బొలేరో ట్రక్‌పై డీజే సౌండ్ బాక్స్‌లతో ట్రాపిక్‌కు అంతరాయం కలిగించిన వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వీరు నక్కావారిపాలెంకు చెందిన వ్యక్తులు రోడ్డుపై కూర్చుని సుమారు 30 నిమిషాలకు పైగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించి ప్రజలకు ఇబ్బంది కలిగించినట్టు తెలిపారు. ఎటువంటి అనుమతి లేకుండా ఊరేగింపులో డీజే సౌండ్స్ ఉపయోగించి ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

లింగపాలెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై, రెవెన్యూ సిబ్బందితో కలిసి పట్టుకున్నట్టు డీటీ ప్రసాద్ తెలిపారు సివిల్ సప్లై డీటీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెం కొణిజర్ల రోడ్డులో ఒక వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న రూ.36వేల విలువైన 10 క్వింటాల 39కేజీల రేషన్ బియ్యాన్ని సోమవారం రెవెన్యూ, సివిల్‌సప్లై అధికారులు పట్టుకు న్నారు. వ్యాన్‌లో 21మూటల్లో నింపి తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బియ్యం కొనుగోలు చేసిన వ్యక్తి, వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైలు పట్టాలపై యువకుడి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు


యువకుడితో పోలీసులు

ఏలూరు క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సమస్యలు ఉన్నాయని క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకోవడం వల్ల సమస్యలు పరిష్కారం కావని ఏలూరు త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు సూచించారు. ఏలూరు బీడీ కాలనీ ప్రాంతానికి చెందిన షేక్ ఉమర్ షారూక్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయితే భార్యా భర్తల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో జీవితంపై విరక్తిచెంది ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకోవాలని రైలు పట్టాలపై ఉన్నాడు. అదే సమయంలో ఆ సంఘటన చూసిన వారు 112కు కాల్ చేసి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఏలూరు త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ రాంబాబు, కానిస్టేబుల్ నరేంద్ర వెంటనే వెళ్లారు. అప్పటికే రైలు వద్దకు వచ్చేస్తున్న సమయంలో ప్రాణాలను లెక్క చేయకుండా కానిస్టేబుల్ నరేంద్ర రైలు పట్టాలపైకి వెళ్లి షారూక్‌ను కాపాడారు. అనంతరం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లి దండ్రులకు సమాచారం ఇచ్చారు. ఆత్మహత్య వల్ల ఆ కుటుంబం తీరని దుఃఖసంద్రంలో ఉంటుందని,స్నేహితులు కూడా వేదనకు గురవుతారని, ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని ఏ సమస్య అయినా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు.


నక్కల కాలువ ముంపు కారణంగా వరద చేరి కుళ్లిపోయిన వరి పొలాలు

పంటలు కోల్పోవడం ఇక మా వల్ల కాదు..

- నక్కల కాలువ పరివాహక రైతుల ఆవేదన
- శాశ్వత పరిష్కారం కావాలని డిమాండ్

ఆచంట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆచంట వేమవరం నక్కల కాలువను ఆనుకుని ఉన్న సార్వా పంటకు సంబంధించి పొలాలు నిత్యం ముంపు బారిన పడుతుంటాయి. సుమారు నక్కల కాలువను ఆనుకుని 600ఎకరాలు పంట పొలాలు సార్వా పంట సమయంలో తరచూ వర్షాలు కురవడం, దానికి తోడు గోదావరి ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఈ ప్రాంతంలో ఉన్న పొలాలు ముంపు బారిన పడ్డాయి. వేసిన నాట్లు పాడవడంతో రైతులు మరోసారి నాట్లు వేశారు. గోదావరి మరలా ఉగ్రరూపం దాల్చడం, నక్కల కాలువ పెరగడంతో మళ్లీ అదే సమస్య తలెత్తింది. సుమారు 600 ఎకరాల్లో రెండు సార్లు వేసిన నారు కుళ్లిపోయింది. నక్కలకాలువ వల్ల రైతులకు సార్వా పంటకు సంబంధించి నష్టం జరగకుండా ఉండాలంటే నక్కల కాలువ నుంచి శాశ్వత పరిష్కారం చేపట్టాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. లేకపోతే ప్రతి ఏటా ఇదే పరిస్థితి తలెత్తుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పదేళ్ల తరువాత తెరుచుకున్న పెనుమంట్ర సొసైటీ లాకర్లు


లాకర్లు ఓపెన్ చేస్తున్న అధికారులు

పెనుమంట్ర, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):పదేళ్ల తర్వాత పెనుమంట్ర విశాల సహకార పరపతి సంఘం సేఫ్ లాకర్లు సోమవారం మధ్యాహ్నం మండల స్థాయి కమిటీ త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో సెంట్రల్ బ్యాంక్ సిబ్బంది సేఫ్ లాకర్లు తెరిచారు. 2015లో అప్పటి పాలకవర్గం సీఈవో కలిసి బినామీలకు రుణాలు మంజూరు చేశారని అవినీతి ఆరోపణలతో విమర్శలు ఎదుర్కొంది. అప్పటి మండల పరిషత్ అధ్యక్షురాలు కలిగిపూడి సరోజినీ,మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లడంతో అప్పటి సీఎం చంద్రబాబును కలిసి సొసైటీ అవినీతిని వివరించగా సీబీసీఐడీ విచారణకు ఆ దేశించారు.బ్యాంకుపై రైతులకు నమ్మకం సన్నగిల్లడంతో కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయి. ఇటీవల త్రిసభ్య కమిటీ ఏర్పాటుతో జిల్లా సహకార బ్యాంక్ త్వరలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయనున్న గోల్డ్ లోన్ ప్రాజెక్టులో భాగంగా రైతాంగానికి రుణాలు మంజూరు చేసేందుకు సోమవారం సాయంత్రం ఎంఎల్‌వో ఎం.ఎం.రెహమాన్, సూపర్ వైజర్ పసుపులేటి రాంబాబు సెక్రటరీ కె. వెంకటేష్ డిప్యూటీ తహసీల్దార్ ఏలియమ్మ, పోలీస్ సిబ్బంది సమక్షంలో సేఫ్ లాకర్లు తెరిచారు. ఎటువంటి వస్తువులు లేవని, రైతాంగం వినియోగించుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. పదేళ్లుగా సీఈవో వద్దే సేఫ్టీ లాకర్ తాళాలు ఉండటంతో ఓపెన్ చేయలేకపోయారు. సొసైటీ కార్యదర్శికి సేఫ్ లాకర్ల తాళాలు అందజేయడంతో అధికారుల సమక్షంలో తెరిచామని సహకార సంఘం అధికారులు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

భీమవరం క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి చెందారు. మొక్కలు శుభ్రం చేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, ఆక్వా చెరువు వద్ద మరొకరు మృతి చెందారు.వన్‌టౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక చిన అప్పారావు తోటకు చెందిన లాజర్(50) వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం రాత్రి మొక్కలు శుభ్రం చేస్తున్నాడు. ఆ సమయంలో అరటి చెట్టు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో లాజర్‌కు షాక్ తగిలింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ఆసుపత్రికి తరలించారు.

చేపల చెరువు వద్ద..

మొగల్తూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వ్యక్తి మృతి చెందినట్టు మొగల్తూరు ఎస్ఐ వై. నాగలక్ష్మి తెలిపారు.భీమవరం మండలం వెంప గ్రామానికి చెందిన తోటే మనోహర్(46) మొగల్తూరు పంచాయతీ పరిధి నక్కావారిపాలెంలో ఆక్వా చెరువులపై పని చేస్తున్నాడన్నారు. చెరువు వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఆదివారం ఫీజు తగిలిస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

నరసాపురంరూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నరసాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తుండ్రురులో కోడిపందేల స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. 11 మందిని అరెస్టు చేసి వారి నుంచి 23,250 నగదు, పది మోటార్ సైకిళ్లు, నాలుగు సెల్ ఫోన్లు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్.ఐ. వెంకట సురేశ్ తెలిపారు. పట్టుబడిన నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.


దుకాణాలు పరిశీలిస్తున్న పోలీసులు

బాణసంచా దుకాణాల్లో తనిఖీలు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాణసంచా దుకాణాలను జంగారెడ్డిగూడెం సీఐ ఎం.వి.సుభాశ్, ఎస్.ఐ. ఎస్.కె. జబీర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. సీఐ సుభాశ్ మాట్లాడుతూ దీపావళి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో లైసెన్సు లేకుండా అక్రమంగా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.పేలుడు సామగ్రి నిల్వ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎవరైనా అక్రమంగా బాణసంచా విక్రయిస్తే 112కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

ఫ్యాప్టో ధర్నాను జయప్రదం చేయండి : శామ్యూల్

చింతలపూడి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై ఈ నెల 7న విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే రాష్ట్ర ఫ్యాప్టో ధర్నాను జయప్రదం చేయాలని ఫ్యాప్టో సంఘ సహాయ కార్యదర్శి, ఏలూరు జిల్లా ఎస్టీయూ సంఘం అధ్యక్షులు ముప్పిడి శామ్యూల్ పేర్కొన్నారు. ప్రధానంగా 12వ పీఆర్సీ ప్రకటించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, ఐదు డీఏలు విడు దల చేయాలని, తదితర డిమాండ్లతో ఈ ధర్నా చేస్తున్నామని, జిల్లాలోని ఫ్యాప్టో సభ్యులంతా తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేడు దుర్గమ్మ సన్నిధిలో అన్న సమారాధన

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):పత్తేబాదలోని దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయం వద్ద దేవీ శర్నవరాత్రులు ముగిశాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఆలయ ప్రాంగణంలో భక్తులకు మహా అన్నప్రసాద వితరణను నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మ కర్తల మండలి చైర్మన్ వృద్ధి సత్యనారాయణమూర్తి, ఈవో నల్లూరి సతీశ్ కుమార్, ఆలయ ఇన్‌చార్జి బాబిలు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు, విశేష పూజలు జరుగుతాయని కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ఆలయాల దర్శనాలతో మానసిక ప్రశాంతత

పెదవేగి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆలయాల దర్శనాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం రాయన్నపాలెం పాతూరులో పునఃనిర్మించిన గంగానమ్మ, పోతురాజు బాబు, నాగేంద్రస్వామి వార్ల విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విగ్రహప్రతిష్ఠ అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రాయన్నపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో గంగానమ్మవారి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని, పూజలు జరిపారు. ఆలయ నిర్మాణానికి స్థలాన్ని ఇచ్చిన దాత పర్వతనేని వెంకటసుబ్బయ్య, సీతామహాలక్ష్మి దంపతులను ఎమ్మెల్యే ప్రభాకర్ ప్రత్యేకంగా అభినందించారు. శ్రీరాట్నాలమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ మన్నే శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పర్వతనేని ప్రభాకర్, మంచినేని శ్రీనివాసరావు, తాతా సత్యనారాయణ, పామర్తి నాగభూషణం పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సెరిబ్రల్ పాల్సీపై అవగాహన

ఏలూరు రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచ సెరిబ్రల్ పాల్సీ దినోత్సవం సందర్భంగా ఏలూరులోని దొండపాడులో ఉన్న ఉమా ఎడ్యుకేషన్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సహకారంతో సోమవారం టైటస్ నగర్‌లోని పీహెచ్‌సీ సెంటర్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మెడికల్ సూపర్ వైజర్ కె.నిర్మల సెరిబ్రల్ పాల్సీపై వివరించారు. సెరెబ్రల్ పాల్సీ అనేది మెదడు అభివృద్ధిలో లోపం అని, అభివృద్ధి చెందుతున్న మెదడుకు జరిగిన నష్టం కారణంగా సంభవించే శాశ్వతమైన రుగ్మత అన్నారు. సంస్థ కో-ఆర్డినేటర్ డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సెరిబ్రల్ పాల్సీకి పూర్తి నివారణ లేనప్పటికీ సరైన చికిత్సతో జీవనప్రమాణాన్ని మెరుగు పరచవచ్చన్నారు.

'జంగారెడ్డిగూడెం తహసీల్దార్‌పై చర్యలు తీసుకోండి'

ఏలూరు రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం కేతవరం సీలింగ్ భూమి పట్టాదారులుగా ఉన్న వారిని ఆ భూముల్లోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్న తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని బీకేఎంయూ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను కోరారు. సోమవారం బీకేఎంయూ సీపీఐ నాయకులు కేతవరం భూ సమస్యపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను కలిసి వనతిపత్రం అందజేశారు.1975లో ల్యాండ్ సీలింగ్‌లో 67 ఎకరాల్లో 66 మంది పేదలకు ప్రభుత్వం పట్టాలిచ్చిందన్నారు. ఆ భూముల్లోకి వెళ్లి సాగు చేస్తుంటే తహసీల్దార్ పోలీసులను పంపించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. బీకేఎంయూ జిల్లా సహాయ కార్యదర్శి గోలిమే బాలయేసు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జె.వి.రమణరాజు, కేతవరం దళితులు మంచాల ప్రభాకర్, ముప్పిడి రత్తయ్య, టి.నాగరాజు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేలకు చిత్రపటాలు అందజేస్తున్న ఆలయ ఈవో మూర్తి

శ్రీవారి సేవలో గోపాలపురం, ఉంగుటూరు ఎమ్మెల్యేలు

ద్వారకాతిరుమల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని గోపాలపురం, ఉంగుటూరు ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట్రాజు, పత్సమట్ల ధర్మరాజులు సోమవారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వారికి ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యేలు, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని వేదాశీర్వచనం పొందారు. ఆలయ ఈవో మూర్తి స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు, ప్రసాదాలను అందచేశారు. వారి వెంట ఏఎంసీ చైర్మన్ బ్రహ్మారాజు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ పోలిన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం మండల కమిటీ ఎన్నిక

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం యూటీఎఫ్ భవనంలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం మండల మహాసభ బోడిక రామచంద్రరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండల నూతన కమిటీను ఎన్నుకున్నారు. మండల అధ్య క్షుడిగా అనపర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా బొడ్డు రాంబాబు, ఉపాధ్యక్షుడిగా బోడిక రామచంద్రరావు, గోలి నర్సిరెడ్డి, మండల సహాయ కార్యదర్శులుగా మాండ్రు సూర్యచంద్రం, అల్లూరి వెంకటరామరాజు, మరో ఏడుగురితో నూతన కమిటీ ఎన్నిక జరిగింది.


వెంకటేశ్వరరావు, రాంబాబు



మండే ఎండ..

ఉమ్మడి జిల్లా అండర్-14, 17 విభాగాల్లో బాల, బాలికలకు తైక్వాండో, హ్యాండ్‌బాల్ ఎంపికలు సోమవారం ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగాయి. ఎండ దంచి కొట్టడంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిర్వాహకులు కనీసం టెంట్లు కూడా ఏర్పాటు చేయలేదు..



(ఫొటో గ్రాఫర్, ఏలూరు)

ఆశల సాగు!

(3వ పేజీ తరువాయి)

రైతులు ఆందోళన చెందుతు న్నారు. రెండు మండలాల్లో మూడు నుంచి నాలుగు వేల ఎకరాల్లో మిర్చి పంట సాగవుతుం దని అంచనా.

గిట్టుబాటు ధర పైనే ఆశలు..

మూడేళ్లుగా మిర్చి రైతాంగం తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. వైరస్‌ల తాకిడితో దిగుబడులు తగ్గడంతో పాటు సరైన గిట్టుబాటు ధర ఉండడం లేదు. గతేడాది కొంత ఆశాజనకంగా దిగుబడులు ఉన్నా క్వింటా మిర్చి రూ.7వేలు నుంచి రూ.10 వేలే పలికింది. ఎకరంలో మిర్చి కోతలు కోయడానికి రూ.6 వేల నుంచి రూ.7వేలు ఖర్చయ్యింది. పెట్టుబడి రాక నష్టాన్ని చవిచూశారు. మళ్లీ ఎన్నో ఆశలతో ఆలస్యమైనా సాగును చేపట్టారు. ఈ ఏడాదైనా ప్రభుత్వం గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సమయానికి బస్సులు రావు.. వచ్చినా ఆగవు..

పోలవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించకపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉచిత ఆర్టీసీ ప్రయాణాల కారణంగా ఎక్కువ శాతం మహిళలు ఆర్టీసీ బస్సులనే ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం, నిడదవోలు, జంగారెడ్డిగూడెం, తాడే పల్లిగూడెం నుంచి పోలవరం రాకపోకలు సాగించే బస్సులు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటం, అదనపు సర్వీసులు లేకపోవడంతో బస్ స్టాపుల్లో ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉంటున్నారు. పోలవరం నుంచి బయల్దేరి రెండు స్టాపులు దాటేసరికే బస్సులు ఫుల్ అయిపోతున్నాయి. దీంతో మిగిలిన స్టాపుల్లో బస్సులు ఆగకుండా వెళ్తున్నాయి. ప్రయాణికులు చేసేది లేక మరో బస్సు రాకకోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. రద్దీ కారణంగా టిక్కెట్లు కొట్టడం కండక్టర్లకు కష్టతరంగా మారడం, స్టాపుదాటి మరో స్టాపు వచ్చేలోపు టిక్కెట్లు కొట్టేందుకు మార్గమధ్యలో బస్సులు ఆపడంతో సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఆర్టీసీ అధికారులు స్పందించి సర్వీసులను పెంచి సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

ఈ సమస్యకు పరిష్కారం లేదా?

- రాజీవ్ స్నేహ వారధిలో రాకపోకలకు నీటి వల్ల అంతరాయం
- వారధిని అభివృద్ధి చేయాలంటూ ప్రజల వేడుకోలు
- ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామంటూ ఆవేదన

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలోని వసంత మహల్ సెంటర్ నుంచి రామచంద్రరావుపేట వెళ్లేందుకు వీలుగా గతంలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు నిరంతరం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వారధిలో నీరు నిల్వ ఉండడం, రోడ్డు గోతులమయం కావడం, తరచూ ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, వ్యానులు, చిన్నకార్లు స్నేహవారధి ద్వారా నిరంతరం రేయింబవళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ వారధిని అభివృద్ధి చేయాలని చాలా కాలంగా ప్రజలు ఆందోళన చేస్తున్నారు. ప్రజా సంఘాలు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో సమస్య తీవ్రతరమైంది. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ఈ స్నేహవారధి ద్వారా రాకపోకలు సాగించాలంటే తరచూ ట్రాఫిక్ నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ రోడ్డు వేసే వరకు చిన్నకార్లు, వ్యానులను నిషేధిస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందని పలువురు సూచిస్తున్నారు. రాజీవ్ స్నేహవారధిలో సజావుగా రాకపోకలు సాగించాలంటే నీరు నిల్వ లేకుండా చూడాలని, రోడ్డు సక్రమంగా నిర్మించాలని తద్వారా రాకపోకలకు సుమార్గం అవుతుంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు కలుగజేసుకుని ఈ రాజీవ్ స్నేహవారధి ద్వారా సౌకర్యాలు కల్పిస్తారని నగర ప్రజలు, వాహనదారులు ముక్త కంఠంతో కోరుతున్నారు.



వ్యవసాయ కార్మిక సంఘ సభలను జయప్రదం చేయండి

టి.నర్సాపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): టి.నర్సాపురంలో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే వ్యవసాయ కార్మిక సంఘ ఏలూరు జిల్లా 32వ మహా సభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జిల్లా మహాసభల కరపత్రాలు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ, భూమి, పేదల ఇళ్ల స్థలాల సమస్యలపై నిరంతరం వ్యవసాయ కార్మిక సంఘం పని చేస్తుందన్నారు. సంఘ జిల్లా మహాసభలు టి.నర్సాపురంలో మొట్ట మొదటి సారిగా నిర్వహించినట్టు తెలిపారు.ఈ ప్రాంతంలో మహాసభ నిర్వహించడం ద్వారా రైతులకు వ్యవసాయ కార్మికులకు ఉపయోగపడుతుందన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న సంఘ నాయకులు

గ్రీన్‌ఫీల్డ్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వారికి అండగా ఉంటూ పోరాడుతుందన్నారు. ఈ మహాసభల సందర్భంగా జిల్లాలో ఉన్న రైతాంగ సమస్యలతో పాటు వ్యవసాయ కార్మికుల సమస్యలపై చర్చిస్తామన్నారు. మహాసభల జయప్రదానికి ఉద్యోగులు, కార్మికులు, రైతాంగం, వ్యవసాయ కార్మికులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు సహకరించాలని కోరారు.

పోతునూరు గ్రామాభివృద్ధి హర్షణీయం : చింతమనేని

దెందులూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పోతునూరు గ్రామాభివృద్ధికి కొమ్మారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు.సోమవారం పోతునూరు గ్రామంలో కొమ్మారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో దివంగత కొమ్మారెడ్డి సదాశివరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు కొమ్మారెడ్డి రాంబాబు రూ.30 లక్షలతో నిర్మించిన ఆసుపత్రి, రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరు, రూ.10 లక్షలతో విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించి సైకిల్ షెడ్డును ఏపీ స్వచ్ఛ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, దాత కొమ్మరెడ్డి రాంబాబు, కుమారుడు కొమ్మారెడ్డి సదాశివరావు(సిద్ధూ)లతో కలిసి చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ పోతునూరు గ్రామాభివృద్ధికి కొమ్మారెడ్డి కుటుంబం అన్ని విధాలా సహకారం అందిస్తుందన్నారు. పోతునూరు నుంచి ఉండ్రాజవరం గ్రామం మీదుగా రోడ్డును జాతీయ రహదారి వరకు బీటీ రోడ్డుగా నిర్మించేందుకు ప్రభుత్వం రూ.కోటి 50 లక్షలను మంజూరు చేసిందని చింతమనేని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మిగిలిన పనులతో పాటు విద్యార్థుల సైకిల్ షెడ్డు నుంచి సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయాలని, హైస్కూల్ గ్రౌండ్‌ను క్రీడా మైదానంగా చేసేందుకు కృషి చేయాలని దాత రాంబాబును చింతమనేని కోరారు. దీంతో స్పందించిన దాత రాంబాబు మాట్లాడుతూ వెంటనే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఏపీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ తన సొంత గ్రామం పోతునూరు గ్రామాభివృద్ధికి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ఎమ్మెల్యే చింతమనేని సహకారంతో మంచినీటి చెరువు సుందరీకరణతో పాటుగా త్వరలో చెరువును శుభ్రపరిచే పనులు ప్రారంభిస్తామన్నారు. ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, బ్యాంక్ అధ్యక్షుడు బోడేటి మోహన్ బాబు, పార్టీ అధ్యక్షుడు సున్న లక్ష్మణ్ బాబు, ఉప్పలపాటి రామ్‌ప్రసాద్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, వీరమాచినేని ప్రభాకర్, కొమ్మారెడ్డి వెంకట రత్నం, కాకరాల రాజా, చలసాని రాంబాబు, కొత్త సాంబ శివరావు, బాయి రాంప్రసాద్ పాల్గొన్నారు.


ఆసుపత్రి అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని, కొమ్మారెడ్డి పట్టాభిరామ్

క్షీరాభిషేకం : పోతునూరు గ్రామంలో కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్‌ల సేవా పథకం ద్వారా రూ.15 వేలు ఆటో డ్రైవర్లకు నగదు జమ చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, స్వచ్ఛ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌తో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలకు పోతునూరు గ్రామ ఆటో డ్రైవర్లతో కలిసి క్షీరాభిషేకం చేశారు.

మరుగుదొడ్లు నిరుపయోగం

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పే అండ్ యూజ్ సిస్టంలో ఇండోర్ స్టేడియం సమీపంలో వేలాది రూపాయలతో మరుగుదొడ్ల సముదాయాన్ని నిర్మించి సుమారు ఏడేళ్లు అవుతుంది. కొద్ది రోజులు సజావుగా నగరపాలక సంస్థ అధికారులు పర్యవేక్షించినా అనంతరం ఈ సముదాయం గురించి పట్టించుకోలేదు. దీంతో ఇటీవల కొందరు వ్యక్తులు ఆందోళన చేయడంతో గేటు తీసి ఉంచారుగాని ఉపయోగకరంగా ఈ సముదాయం లేదు. పరిశుభ్రత కరువు, నీటి సౌకర్యం లేదు, మరుగు దొడ్లు అపరిశుభ్రతగా ఉన్నాయి. ఈ సముదాయం ఇండోర్ స్టేడియంకు ఎస్‌బీఐ, లైబ్రరీ, జడ్పీ తదితర కార్యాలయాలకు చేరు వలో ఉంది. ముఖ్యంగా అన్నక్యాంటీన్ కూడా పరిస రాల్లో ఉంది. ఈ సముదాయాన్ని ఉపయోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఏడేళ్ల క్రితం నిర్మించిన మరుగుదొడ్లు

ఆర్ఎస్ఎస్ శత వసంతాల వేడుక

కామవరపుకోట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఆదివారం ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తయిన సందర్భంగా శత వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య వక్తగా సి.హెచ్.సదాశివరావు(వివేకానంద కేంద్ర కన్యాకుమారి) పాల్గొని ఆర్ఎస్ఎస్‌ను స్థాపించడానికి ప్రధాన ఉద్దేశం, సంఘ్ శత వసంతాల విజయ పరంపర, భారతదేశ ప్రగతిలో సంఘ్ ఎలా దోహదం చేసిందో కూలంకషంగా వివరించారు. ముఖ్య అతిథిగా ఎస్.ఆర్.ఆర్.సూర్యనారాయణరాజు పాల్గొనగా, వీహెచ్‌పీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల సంఘ్ ప్రముఖులు, హిందూ భావజాల అభిమానులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిందితులను కఠినంగా శిక్షించండి

ఏలూరు రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలం ఎల్.ఎన్.డి పేట సమీపం కొవ్వాడ జలాశయం వద్ద ఉన్న సంఘం నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుల్ని కఠినంగా శిక్షించాలని కోరుతూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.గోపిరావు ఆధ్వర్యంలో నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. సంఘ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏలూరు జిల్లా అధ్యక్షుడు కుప్పాల ఆంజనేయులు మాట్లాడుతూ సగర కులస్తుల ఆరాధ్య దైవం భగీరథ మహర్షి అని పేర్కొన్నారు. గతంలో కూడా భగీరథుడి విగ్రహం ధ్వంసం చేశారని పేర్కొన్నారు. విగ్రహాన్ని ప్రతిష్ఠించగా మళ్లీ ధ్వంసం చేయాన్ని తీవ్రంగా ఖండించారు. విగ్రహం ధ్వంసం సగరుల మనోభావాలను దెబ్బ తీశాయని ఆవేదన వ్యక్తం చేశారు. విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు రెడ్డి రాంబాబు, జిల్లా గౌరవ అధ్యక్షులు గండికోట సీతారామరాజు, యువజన అధ్యక్షులు ఇబ్బా నాగేశ్వరరావు, తాడిచెట్టి శివప్రసాద్, ఏలూరు తాడిశెట్టి శివ, గండికోట అప్పారావు పాల్గొన్నారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్ చైర్మన్ రవికి ఎమ్మెల్యే అభినందనలు

ఏలూరు టూటౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మండలపు రవిని ఎమ్మెల్యే బడేటి చంటి అభినందించారు. విజయవాడలో సోమవారం ఆయన పదవీ బాధ్యలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బడేటి చంటి శాలువా కప్పి సత్కరించారు. ప్రమాణ స్వీకారోత్సవంలో సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాసరావు, సొంగా రోషన్ కుమార్, నాయకులు వలవల బాబ్జీ, ముళ్లపూడి బాపిరాజు పాల్గొన్నారు.




ఆందోళన చేస్తున్న బాధితులు

మా బంగారం మాకు ఇప్పించండి

చింతలపూడి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):కనకదుర్గ గోల్డ్ ఫైనాన్స్‌లో చోరీ జరిగి నెల కావస్తున్నా ఇప్పటి వరకు సమాధానం లేదంటూ తనఖా పెట్టిన బాధితులు సోమవారం మధ్యాహ్నం ధర్నా నిర్వహించారు. ధర్నాలో బాధితుడు బూసి రమేశ్ మాట్లాడుతూ బంగారం ఈ ఫైనాన్స్‌లో తాకట్టు పెడితే దొంగతనం జరిగి నెల రోజులైనా సమాధానం లేదని వాపోయారు. సుమారు 15 మంది ఈ ధర్నాలో పాల్గొని నినాదాలు చేశారు. నెల క్రితం సుమారు రెండున్నర కోట్లు విలువ చేసే బంగారం ఆడిట్ పేరుతో తనిఖీ చేసిన అధికారి వాటిని తీసుకుని పరారయ్యాడు. నేటికీ దొంగ దొరకలేదు, బంగారం లభించలేదు. చోరీ చేసిన ఆడిటర్‌ను పట్టిస్తే లక్ష రూపాయల బహుమానం ఇస్తామని పోలీసులు ప్రకటించారు. ఇంతవరకు దొరక్క పోవడంతో బాధితులు రోడ్డెక్కారు.

విద్యార్థులు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలి

కామవరపుకోట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మానసిక ఆరోగ్యంతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని సమగ్ర శిక్ష అభియాన్ మానసిక కౌన్సిలర్ ఎం.సుధీర్ కుమార్ పేర్కొన్నారు. కామవరపుకోట మండలం తూర్పుయడవల్లి గ్రామంలోని హైస్కూల్లోని విద్యార్థులకు ఆరోగ్యంపై సోమవారం అవగాహన కల్పించారు. సుధీర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకుని నాణ్యమైన విద్యను అభ్యసించాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల నుంచి సరికొత్త విషయాలు నేర్చుకోవాలని, నాణ్యమైన ఆహారం తీసుకోవాలని, మానసిక ఒత్తిడి లేకుండా ఉంటూ సత్ప్రవర్తనను అలవాటు చేసుకోవాలన్నారు. హెచ్ఎం కోటేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. ఈ మేరకు విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఎస్ఏ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్ కుమార్

జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన కల్పించండి

- కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశం

ఏలూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని గ్రామ సమాఖ్య, వార్డు, సచివాలయాల్లో అవగాహన కార్యక్రమాలు వెంటనే వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం ఆమె టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తూ జీఎస్టీ తగ్గింపు ఫలాలు సమాజంలోని ప్రతీ కుటుంబానికి తెలిసేలా అవగాహన కలిగించాలన్నారు. దీనిపై ముద్రించిన కరపత్రాలను సచివాలయ స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పీ సీఈవో శ్రీహరి, ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ భానుప్రతాప్, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

లాంచీల పునరుద్ధరణపై హర్షం

పోలవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పోలవరం పురుషోత్తపట్నం ఫెర్రీ రేవు లాంచీల రాకపోకలను సోమవారం అధికారులు పునరుద్ధరించారు. లాంచీల సర్వీసులు పునరుద్ధరించండనే శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తా కథనానికి స్పందన లభించింది. దీంతో పురుషోత్తపట్నం, వంగలపూడి, సీతానగరం, గోకవరం రాకపోకలు సాగించే ప్రయాణికులు ఫెర్రీ లాంచీపై తమ ప్రయాణాలను కొనసాగించారు. స్పందించి లాంచీ సర్వీసులు పునరుద్ధరించినందుకు అధికారులకు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కాంగ్రెస్ నాయకుల రాక

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జె.డి.శీలం, ఏఐసీసీ జాయింట్ కార్యదర్శి డాక్టర్ పాలక్ వర్మలు మంగళవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి విచ్చేసి నాయకులు, కార్యకర్తలతో సమాయత్తమవుతారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు సోమవారం తెలిపారు.ఏలూరు నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు, రేపు శిక్షణ తరగతులు

బుట్టాయగూడెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశాలపై మండల స్థాయిలో ఈ నెల 7,8 తేదీల్లో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణలు ఉంటాయని ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు విధిగా హాజరు కావాలన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో మేలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వస్తుసేవలపై పన్నులను భారీగా తగ్గించడం, మినహాయించడం వల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందని, తద్వారా ఆర్థిక కార్యకలాపాలు అభివృద్ధి చెందడం ద్వారా దేశం ఆర్థికంగా బలోపేతం అవుతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు అన్నారు. జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సు సోమవారం కళాశాలలో జరిగింది. పన్నుల వ్యవస్థ, శ్లాబుల ద్వారా వినియోగదారులకు జరిగే మేలుపై అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ రాంబాబు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్, పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ పట్టాభిరామన్న, సెట్‌వెల్ కార్యాలయ అకౌంటెంట్ ప్రసాదరావు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: టీడీపీ

టి.నర్సాపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలుగుదేశం పార్టీ నాయకులు గంటా సతీశ్ అన్నారు. బందంచర్ల గ్రామంలో ఆటోడ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ల చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సతీశ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లందరికీ రూ.15వేలు బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందన్నారు. ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను కూడా కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని అన్నారు. కార్యక్రమంలో వాసిరెడ్డి విద్యాసాగర్, ఒబిళ్లనేని శ్రీనివాసరావు, నాయుడు ధర్మరాజు, కొక్కిరిగడ్డ బాలస్వామి, సతీశ్, మారుమూడి ఇజ్రాయిల్, కాకి నాగేశ్వరరావు, గుడిమెట్ల రాంబాబు, వీరంకి నాగేశ్వరరావు, నత్తా మిషక్ పాల్గొన్నారు.

వీఆర్వోపై దౌర్జన్యం.. పోలీసులకు ఫిర్యాదు

చింతలపూడి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అక్రమ రవాణా అవుతున్న ఇసుకను చెక్‌పోస్టు వద్ద వీఆర్వో ఆపి కాగితాలు చూపించమని అడిగినందుకు ఒక వ్యక్తి దౌర్జన్యానికి దిగాడని వీఆర్వో చింతలపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై వీఆర్వో పుల్లారావు మాట్లాడుతూ తనను చెక్‌పోస్టు వద్ద తనిఖీ నిమిత్తం నియమించారని, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుని కాగితాలు చూపించమని అడి గితే లారీలోని ఒక వ్యక్తి తనపై దౌర్జన్యానికి వచ్చాడని, సెల్‌లో లారీ ఫొటో తీస్తుం డగా ఫోన్ లాక్కున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు రక్షణ కల్పించాలంటూ వీఆర్వో సంఘం ఆధ్వర్యంలో ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా జట్ల ఎంపిక

నూజివీడు టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా బాస్కెట్ బాల్ అండర్-14, 17 బాలబాలికల జట్ల ఎంపిక నూజివీడులోని ఓ ప్రైవేట్ పాఠశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ఈ జట్ల ఎంపిక ప్రక్రియను నూజివీడు సుధాకర్ కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ జి.రాంబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, ఎస్.లక్ష్మీవనజ, సతీష్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు

నూజివీడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండల పరిధిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17 బాలబాలికల క్రీడా పోటీలు ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సెయింట్ థామస్ హైస్కూల్లో జరుగుతాయని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుని బి.అనూరాధ తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగ, చెస్, అథ్లెటిక్స్ క్రీడాపోటీల్లో పాల్గొనాలన్నారు.





కలెక్టర్ నుంచి అవార్డులు అందుకుంటున్న యునానీ వైద్యశాల డాక్టర్ శశికళ, సూరేపల్లి గ్రామ కార్యదర్శి నాగశిరోమణి

స్వచ్ఛాంధ్ర అవార్డులు

ఏలూరు సర్ సీఆర్ఆర్ రెడ్డి కళాశాల ఆడిటోరియంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర అవార్డులను సాధించిన వారికి అవార్డులు, ప్రశంసాపత్రాలను కలెక్టర్ వెట్రిసెల్వి సోమ వారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవార్డుల సాధనతో మరింత రెట్టింపు ఉత్సాహంతో రాబోయే లక్ష్యాల సాధనకు పనిచేయాలన్నారు. చిత్తపూరు యునానీ వైద్యశాల, సూరేపల్లి పంచాయతీ ఆరుతెగలపాడు హైస్కూల్, గ్రోవెల్ సంస్థ అవార్డులు దక్కించుకున్నాయి.





అవార్డులందుకుంటున్న ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం, గ్రోవెల్ యూనిట్ ప్రతినిధులు

స్వచ్ఛ ఆసుపత్రిగా చిత్తపూరు యునానీ వైద్యశాల

చాట్రాయి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసినందుకు మండలంలోని చిత్తపూరు ప్రభుత్వ యునానీ వైద్యశాల జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రభుత్వాసుపత్రిగా అవార్డు పొందింది. ఆసుపత్రి పరిశుభ్రత, పచ్చదనం, మౌలిక వసతుల కల్పన, ప్లాస్టిక్ నిషేదం మొదలైన అంశాలలో ఉత్తమ పనితీరుకు ప్రదర్శించినందుకు ఈ అవార్డు వరించింది. 1965లో చిత్తపూరులో ఈ ఆసుపత్రి ప్రారంభించారు. డాక్టర్ శశికళ ప్రభుత్వ నిధులతో పాటు తన సొంత నిధులు ఖర్చు చేసి ఆసుపత్రిని సుందరంగా తీర్చిదిద్దటంతో పాటు యునాని వైద్యాన్ని మళ్ళీ ప్రజలకు చేరువ చేశారు.

స్వచ్ఛ పంచాయతీగా సూరేపల్లి

ముసునూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సూరేపల్లి పంచాయతీ స్వచ్ఛ పంచాయతీగా అవార్డు దక్కించుకుంది. ఏలూరులో జిల్లాస్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డుల కార్యక్రమంలో సోమవారం కలెక్టర్ వెట్రిసెల్వి చేతులమీదుగా పంచాయతీ కార్యదర్శి డి.నాగశిరోమణి అవార్డును అందుకున్నారు. గ్రామంలో చెత్తసేకరణ, పారిశుధ్యం మెరుగులో పంచాయతీ పనితీరుకు ఈ అవార్డు దక్కింది. అవార్డు రావడం పై సర్పంచ్ ముల్లంగి సుధారాణి, వార్డుసభ్యులు కొక్కిరపాటి శోభనాద్రి, గ్రామ టీడీపీ అధ్యక్షులు చల్లగుళ్ళ మల్లిబాబు, నాయకులు పొన్నగంటి బుజ్జియ్య తదితరులు పంచాయతీ అధికారులు, పారిశుధ్య కార్మికులను ఈ సందర్భంగా అభినందించారు.

ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్‌కు అవార్డు

కలిదిండి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరు తెగలపాడు జడ్పీ హైస్కూల్‌కు స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర అవార్డును కలెక్టర్ వెట్రిసెల్వి చేతులమీదుగా ప్రధానోపాధ్యాయుడు అనిశెట్టి శ్రీనివాస్ సోమవారం అందుకున్నారు. జిల్లాలో ఐదు జడ్పీ హైస్కూల్స్‌ని ఎంపిక చేయగా, ప్రథమ స్థానంలో ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్ నిలిచింది. టాయ్‌లెట్ క్లీనింగ్, మొక్కలు పెంచటం, కూరగాయలు పండించటంతోపాటు ఆవరణంతా పరిశుభ్రంగా ఉంచినందుకు గాను అవార్డు లభించింది. క్లస్టర్ అసిస్టెంట్‌నున్న శ్రీనివాస్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రోవెల్ ప్రోసెసింగ్ యూనిట్‌కు అవార్డు

ముదినేపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెంలోని గ్రోవెల్ సీ ఫుడ్స్ ప్రోసెసింగ్ యూనిట్‌కు స్వచ్ఛాంధ్ర-2025 అవార్డు దక్కింది. అవార్డును సోమవారం ఏలూరులో కలెక్టర్ చేతుల మీదుగా ఆ యూనిట్ డైరెక్టర్ శ్రీనివాస్, హెచ్‌ఆర్ ప్రతిమ అందుకున్నారు. ప్రాసెసింగ్ యూనిట్‌లో ఎటువంటి కాలుష్యం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నందుకు కంపెనీ ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. ఇటీవల ఏలూరు పొల్యూషన్ కంట్రోల్ జిల్లా అధికారులు కలుషిత నీటిని నివారించడంలో కంపెనీ తీసుకుంటున్న జాగ్రత్తలను గుర్తించి ఈ అవార్డుకు సిఫార్సు చేశారు.



మండవ వెంకట్రామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పార్థసారథి, మాజీ ఎంపీ మాగంటి బాబు తదితరులు

మండవ వెంకట్రామయ్యకు ప్రముఖుల నివాళి

నూజివీడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నూజివీడు సీడ్స్ అధినేత మండవ వెంకట్రామయ్యకు నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి నివాళులర్పించారు. నూజివీడు మండలం తుక్కులూరు గ్రామంలోని వెంకట్రామయ్య నివాసానికి వెళ్ళిన అయన ఏలూరు మాజీ ఎంపీ, టీడీపీ నాయకుడు మాగంటి వెంకటేశ్వరరావు (బాబు)తో కలిసి వెంకట్రామయ్య కుటుంబీకులను పరామర్శించి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. టీడీపీ నాయకుడు అక్కినేని చందు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించండి



శిక్షణలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ఆగిరిపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ అధ్యాపకుడు జి. విజయ్‌కుమార్ పేర్కొన్నారు. తోటపల్లి హిల్ పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి మాట్లాడుతూ నూతన ఉపాధ్యాయులుగా అడుగుపెడుతున్న వారు అంకిత భావంతో పనిచేసి విద్య ప్రమాణాలు మెరుగుపరచాలని పలు సూచనలు చేశారు. డాక్టర్ రావి అరుణ, శ్రీమన్నారాయణ, రవీంద్ర ప్రసాద్, ఎంఈవోలు ఆనంద్‌కుమార్, బీవీఎస్ సుబ్బారావు, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బైక్ ర్యాలీ

ఆగిరిపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 7న ఫ్యాప్టో తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి సంఘీభావంగా ఉపాధ్యాయుల బైక్ ర్యాలీ నిర్వహించినట్టు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు తాడి నరసింహరావు తెలిపారు. ఈ సందర్భంగా మండల ఫ్యాప్టో కన్వీనర్లు మక్కే వేణు గోపాలరావు, కలపాల అజరయ్యలు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏను ఇవ్వాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయుల సర్వీసును క్రమబద్ధీకరించి వారి రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్ళకు పెంచాలని, పెండింగ్ మెడికల్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. మహాధర్నాలో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ

ముసునూరు, అక్టోబరు 6 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని చెక్కపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థులకు కొత్తపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో ఉచితంగా కళ్ళజోళ్ళను సోమవారం అందజేశారు. గతనెల 18న లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటివైద్య శిబిరం నిర్వహించగా 75 మంది విద్యార్థులకు కళ్లజోళ్ల అవసరమని వైద్యులు నిర్ధారించారు. ట్రస్ట్ అధినేత కొత్తపల్లి పూర్ణచంద్ర రావు, లయన్స్‌క్లబ్ ప్రతినిధి పోలవరపు నరసింహారావు సంయుక్తంగా కళ్ళజోళ్ళను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. హెచ్‌ఎం అల్లాభక్షు, స్టాఫ్‌సెక్రటరి పద్మకిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్లు అందించిన ట్రస్ట్ అధినేత రాజ్‌కుమార్

రాజ్ ట్రస్ట్ కుట్టు మిషన్ల వితరణ

కలిదిండి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కలిదిండి ఆర్‌సీఎం చర్చి ఆవరణలో సోమవారం రాజ్ ట్రస్ట్ అధినేత గంటా రాజ్ కుమార్, జక్కుల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో 26 మంది పేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కట్టా గోపి, సీనియర్ న్యాయవాది న్యూటన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	242
చికెన్ స్కిన్‌లెస్	252
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



నూజివీడు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న అంబేడ్కర్ వాది రావణబ్రహ్మ

నిధుల దుర్వినియోగంపై విచారణ జరపండి

చాట్రాయి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్వతాపురం వన సంరక్షణ సమితిలో సుమారు రూ. 40 లక్షలు నిధుల దుర్వినియోగం జరిగిందని, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ వినూత్నకు అంబేడ్కర్ వాది రావణబ్రహ్మ ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం వన సంరక్షణ సమితికి వచ్చిన నిధులపై గ్రామసభ నిర్వహించి నిధుల వ్యయంపై తీర్మానాలు చేయవలసి ఉండగా, ఎటువంటి గ్రామసభ నిర్వహించకుండానే నిధులు స్వాహా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



ఆర్టీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

బస్సులు నడిచేలా చర్యలు చేపట్టండి : మంత్రి

చాట్రాయి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విజయవాడ-సత్తుపల్లి రహదారిలో ఉన్న మండల పరిధిలోని చనుబండ, కృష్ణారావుపాలెం, సూరంపాలెం, కరుణాపురం గ్రామాలకు ఆంధ్ర బస్సులు రాకపోవటంతో మహిళలకు స్త్రీశక్తి పథకం అందని ద్రాక్షగా మారిందని, ఈ గ్రామాలకు బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పార్థసారథికి టీడీపీ మండల నాయకుడు నక్కా రాము వినతిపత్రం అందజేశారు. వెంటనే మంత్రి నూజివీడు ఆర్టీసీ డిపో మేనేజర్‌కి ఫోన్ చేసి విస్సన్నపేట నుంచి మంగళగిరి ఎయిమ్స్‌కి నడుపుతున్న బస్సులను చనుబండ వరకు పొడిగించాలని కోరారు. అలాగే విజయవాడ- విస్సన్నపేట మధ్య నడుస్తున్న మెట్రో బస్సులను చనుబండ వరకు పొడిగించేలా విజయవాడ ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడతానని మంత్రి హామీ ఇచ్చినట్లు రాము చెప్పారు.

పంటకాలువలో చెత్త తొలగింపు

మండవల్లి(కైకలూరు) అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పోల్‌రాజ్ పంట కాలువలో గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులను సోమవారం ప్రారంభించారు. గన్నవరం నీటి సంఘం అధ్యక్షుడు కూనపురెడ్డి బాలకోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో పంట కాలువలో చెత్త తొలగింపు పనులను నిర్వహించారు. సుమారు 4 కిలోమీటర్ల మేర చెత్త తొలగింపు పనులు నిర్వహిస్తున్నట్లు, చెత్త తొలగింపుతో నీటి ప్రవాహానికి ఎలాంటి అవరోధం లేకుండా దిగువకు నీటి పారుదల జరుగుతుందని నాయకులు తెలిపారు. టీడీపీ పెరికేగూడెం నాయకుడు శేషుబాబు, జనసేన నాయకుడు చెన్నంశెట్టి నందకిషోర్, రైతులు పాల్గొన్నారు.

ఆశల సాగు!

(3వ పేజీ తరువాయి)

రైతులు ఆందోళన చెందుతు న్నారు. రెండు మండలాల్లో మూడు నుంచి నాలుగు వేల ఎకరాల్లో మిర్చి పంట సాగవుతుందని అంచనా.

గిట్టుబాటు ధర పైనే ఆశలు

మూడేళ్లుగా మిర్చి రైతాంగం తీవ్ర నష్టాలు చవి చూస్తున్నారు. వైరస్‌ల తాకిడితో దిగుబడులు తగ్గడంతో పాటు సరైన గిట్టుబాటు ధర ఉండడం లేదు. గతేడాది కొంత ఆశాజనకంగా దిగుబడులు ఉన్నా క్వింటా మిర్చి రూ.7వేలు నుంచి రూ.10 వేలే పలికింది. ఎకరంలో మిర్చి కోతలు కోయడానికి రూ.6 వేల నుంచి రూ.7వేలు ఖర్చయ్యింది. పెట్టుబడి రాక నష్టాన్ని చవిచూశారు. మళ్లీ ఎన్నో ఆశలతో ఆలస్యమైనా సాగును చేపట్టారు. ఈ ఏడాదైనా ప్రభుత్వం గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



పోతనపల్లిలో తనిఖీలు నిర్వహించేందుకు వచ్చిన ఎక్సైజ్ అధికారులు, పోలీసులు

పోతనపల్లిలో ఎక్సైజ్ తనిఖీలు

చాట్రాయి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని గిరిజన గ్రామం పోతనపల్లిలో సోమవారం ఎక్సైజ్ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒక మహిళను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద 2 లీటర్ల సారా, 2 కేజీల బెల్లం స్వాధీనం చేసుకొని 50 లీటర్ల బెల్లం ఊట స్వాధీనం చేసుకున్నట్టు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. ఏలూరు, విజయవాడ స్క్వాడ్స్, తిరువూరు, నూజివీడు, కైకలూరు ఎక్సైజ్ స్టేషన్ల సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై తల్లిదండ్రులకు వివరించాలి

కైకలూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీఎస్టీ 2.0 నూతన సంస్కరణలపై విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ వై శ్రీలత అవగాహన సదస్సు నిర్వహించారు. జీఎస్టీ రేట్లు తగ్గడంతో ప్రజల్లో ఆదాయం పెరగడంతో కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు ఆయా దుకాణాల వద్ద ధరల బోర్డులు లేకపోతే దుకాణాదారుల వద్ద పాత ధరలు, కొత్త ధరల వ్యత్యాసాలను అడిగి తెలుసుకోవాలన్నారు. విద్యార్థుల ఇళ్ళ వద్ద తల్లిదండ్రులకు ఈ విషయంపై అవగాహన కల్పించి ఎవరైనా ధరల తగ్గుదలపై వివక్ష చూపితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు. ఈ నెల 13వ తేదీ వరకు ప్రతి రోజు కళాశాలలో విద్యార్థులు జీఎస్టీ 2.0పై వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం తదితర పోటీలు నిర్వహి స్తామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ అడపా కేదారి, అధ్యాప కులు ఎన్. శ్రీనివాసరావు, బి. వేదాంతం, హరిప్రసాద్, సంధ్య, విజయ్, జ్ఞానప్రసూనాంబ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలత



ప్రశంసాపత్రం అందుకుంటున్న హిస్టరీ అధ్యపకుడు హరిప్రసాద్

అధ్యాపకుడికి ప్రశంసా పత్రం

కైకలూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ ఎం. హరిప్రసాద్‌కు ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఆదివారం గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారాలను గుంటూరుకు చెందిన కేవీఆర్, జయలక్ష్మీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేశారు. కైకలూరు డిగ్రీ కళాశాల నుంచి హరిప్రసాద్ ఈ పురస్కారానికి ఎంపిక కావడంతో ఆయన్ను ఘనంగా సత్కరించి మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రశాంసాపత్రాన్ని అందజేశారు. కళాశాలలో అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

లిబరేషన్ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

నూజివీడు టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ విజ్ఞప్తి చేశారు. నూజివీడులో నవంబర్ 1న మహాసభలు జరుగుతున్నట్లు తెలిపారు. కూటమి 15 నెలల పాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యం అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చి నేడు అదే చట్టాన్ని మరో రూపంలో ప్రజల భూములను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారని హరినాథ్ విమర్శించారు. అతివృష్టి వల్ల ఉత్తరాంధ్ర, శ్రీకాకుళం జిల్లాలో రాయలసీమలో రైతాంగం పంటలు నష్టపోయారని వారికి నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలో టమాట, ఉల్లి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కార్మికుల పని గంటలు పెంపు వ్యతిరేకించాలని కోరారు. ఏలూరు జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు, జిల్లా కమిటీ సభ్యులు చాట్ల బాబురావు, సర్వేసు, సీతామహాలక్ష్మి, వెంకటేశ్వరరావు, కళావతి, భూతం మారయ్య తదితరులు పాల్గొన్నారు.



పోషకాహారంపై అవగాహన

ముసునూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పోషకాహారాన్ని క్రమం తప్పకుండా సమపాళ్లలో తీసుకోవడం వల్ల పిల్లల్లో వ్యాధినిరోధక శక్తితో పాటు వారి పెరుగుదలకు దోహదపడుతుందని, అంగన్‌వాడీ కార్యకర్త పి.రాజకుమారి అన్నారు. సోమవారం చింత లవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా ఈసీసీఈ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిస్కూల్ పిల్లల తల్లులకు పిల్లల ఆట, పాట, మాట తదితర వాటిపై అవగాహన కల్పించారు. పిల్లల శారీరక అభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోషక ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని, ఈ పోషణ అభియాన్‌లో తల్లులు, గర్భవతులు, పిల్లల ఆరోగ్య స్థితిగతులపై క్షుణంగా తెలుసుకుని వారి ఆరోగ్యపరిస్థితిని మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అంగన్‌వాడీ కార్యకర్త రాజకుమారి తెలిపారు. ఉపాధ్యాయులు బెనర్జీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కోట మహిషమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

నూజివీడు టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):దసరా ఉత్సవాలను పురస్కరించుకుని నూజివీడు కోట మహిషాసురమర్ధిని అమ్మవారి హుండీ ఆదాయం రూ.3,30,656 లభించినట్లు దేవదాయ ధర్మదాయశాఖ ఈవో అలివేణిశ్రీ తెలిపారు. 35 రోజులకు గాను ఈ ఆదాయం లభించినట్లు ఆమె తెలిపారు.

రైలు పట్టాలపై యువకుడి ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు

ఏలూరు క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స మస్యలు ఉన్నాయని క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకోవడం వల్ల సమస్యలు పరిష్కారం కావని ఏలూరు త్రి టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు సూచించారు. ఏలూరు బీడీ కాలనీ ప్రాంతానికి చెందిన షేక్ ఉమర్ షారూక్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయితే భార్యా భర్తల మధ్య మనస్ప ర్థలు తలెత్తడంతో జీవితంపై విరక్తిచెంది ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకోవాలని రైలు పట్టాలపై ఉన్నాడు. అది చూసిన వారు 112కు కాల్ చేసి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఏలూరు త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ రాంబాబు, కానిస్టేబుల్ నరేంద్ర వెంటనే వెళ్లారు. అప్పటికే రైలు వచ్చేస్తున్నా ప్రాణాలను లెక్క చేయకుండా కానిస్టేబుల్ నరేంద్ర రైలు పట్టాలపైకి వెళ్లి షారూక్‌ను కాపాడారు. అనంతరం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లి దండ్రులకు సమాచారం ఇచ్చారు. ఆత్మహత్య వల్ల ఆ కుటుంబం, స్నేహితులు కూడా వేదనకు గురవుతారని, ఆత్మహత్యలు సమస్య లకు పరిష్కారం కాదని ఏ సమస్య అయినా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోండి : తహసీల్దార్

ముసునూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లబోయినపల్లి గ్రామంలో రీసర్వే చేపట్టామని తహసీల్దార్ ప్రశాంతి, డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తమ శర్మ తెలిపారు. గ్రామంలోని పట్టాదారులందరికీ రీసర్వేపై సమాచారం అందించామని, రైతులు తమ భూమికి సంబంధించిన దస్తావేజు నకళ్ళు, ఆధార్ కార్డు నకలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలను గ్రామ రెవెన్యూ అధికారికి అందచేయాలని కోరారు. రైతులు వారి భూమికి సంబంధించి హద్దులు ఈ సర్వేలో చూపించవలసి ఉందని, రైతులందరూ ఈ రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

కాంగ్రెస్ సంతకాల సేకరణ

కలిదిండి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓట్ల చోరీ జరిగిందంటూ కాంగ్రెస్ నాయకులు సోమవారం కలిదిండిలో సంతకాల సేకరణ చేపట్టారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజారామ్మోహనరావు, నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డు నోబుల్ మాట్లాడుతూ దొంగ ఓట్లతో మోదీ ప్రధాని అయ్యారని ఆరోపించారు. దేశంలో 65 లక్షలు ఓట్లు చోరీ అయ్యాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కలిదిండిలో వివిధ వర్గాలకు చెందిన 500 మంది సంతకాలు పెట్టారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఈదా పద్మారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

లిబరేషన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

ముసునూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కడపలో డిసెంబరు 6, 7 తేదీల్లో జరిగే సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ 9వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని, మండల కార్యదర్శి వేముల బక్కయ్య పిలుపునిచ్చారు. మహాసభల కరపత్రాలను సోమవారం చెక్కపల్లి, గుడిపాడు, గోపవరం తదితర గ్రామాల్లో నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బక్కయ్య మాట్లాడుతూ రాష్ట్రమహాసభలు కడపలో నిర్వహిస్తుండగా, జిల్లా ప్రథమ మహాసభ నూజివీడులో ఏర్పాటు చేయటం జరిగిందని, అన్నివర్గాల ప్రజలతో పాటు కార్మికులు, కర్షకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా శ్రీశ్యామలాంబ అమ్మవారి గ్రామోత్సవం

కైకలూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి మహోత్సవాలు అనంతరం కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి గామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారిని కైకలూరు పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా హారతులు పట్టి అమ్మవారికి పూజలు చేశారు. మేళతాళాలు నడుమ ఊరేగింపును అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వీఎన్‌కె శేఖర్, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు.



ఘనంగా బాబా ఊరేగింపు

కైకలూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీ షిర్డిసాయి ధ్యానమందిరం ఆధ్వర్యంలో బాబా ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. సోమవారం దసరా ఉత్సవాల ముగిసిన సందర్భంగా బాబా ఊరేగింపును కైకలూరు పురవీధుల్లో ధ్యానమందిర అధ్యక్షుడు కొణిజేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని పూజలు చేశారు.